సంపుటి 10 సంచిక 1 నవంబర్ - డిశంబర్ 2021

# పల్లెసృజన

honeybee.org
Vol-10 Issue-1
www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక





ఇన్నోవేషన్లపై తెలుగు రాష్ట్రాల నాబార్డ్ సిజియంలతో 'పల్లెసృజన' చర్చలు

# అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న మన తెలుగు ఇన్నోవేటర్లు

'హనీబీ నెట్‌వర్క్' మరియు 'జియాన్' సంయుక్తంగా సృజనాత్మక & వినూత్న ఆలోచనలు లేదా సాంప్రదాయ జ్ఞాన పద్ధతుల కోసం మొదటి అంతర్జాతీయ వార్షిక పోటీని నిర్వహించాయి. ఈ పోటీలలో 87 దేశాల నుండి 2,500 ఎంట్రీలను సమీక్షించిన జ్యూరీ 11 మంది ఇన్నోవేటర్లను అంతర్జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. ఇందులో మన 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన ఇద్దరు ఇన్నోవేటర్లు ఎంపిక కావడం 'పల్లెసృజన కుటుంబానికి' ఎంతో ఆనంద దాయకం.





ఆంధ్రప్రదేశ్ హిందూపురం నివాసి మోధా శివకుమార్ 120 సంవత్సరాల నుండి ఎంతో కష్టపడి పని చేస్తున్న "జాకార్డ్" పద్ధతి చేనేత పనిని ఎంతో సులభతరం చేయడంతో పాటు, వేలాది రూపాయలు వెచ్చించాల్సిన చీరల డిజైన్‌కు ఎలాంటి ఖర్చు లేకుండా చేస్తూ "మోధా జాకార్డ్" పేరుతో ఎలక్ట్రానిక్ పరికరాన్ని తయారు చేశాడు.

చీర డిజైన్ కొరకు ఏ డిజైన్ కావాలంటే దాని సంబంధించిన ఫొటో యంత్రానికి ఫీడ్ చేస్తే అలా డిజైన్ నేయబడుతుంది. చేనేత పరిశ్రమ కార్మికులకు కష్టంతో పాటు, ఖర్చును కూడా గణనీయంగా తగ్గించేలా రెండు ప్రధాన సమస్యలను సులభంగా పరిష్కరించేలా ఈ పరికరం కనుగొన్నందుకు మన ఇన్నోవేటర్ 'మోధా శివకుమార్' ఈ పురస్కారాన్ని అందుకున్నాడు.







విశాఖ పట్టణానికి చెందిన శ్రీమతి దూబ రాజు కూరగాయలు, కొన్ని రకాల మూలికలు, ఆకులను మేళవించి ఒక ద్రావణాన్ని తయారు చేసింది. లీటరు నీటిలో ఈ ద్రావణం 15-20 మి.లీ. కలిపి ఆ మిశ్రమంలో టమోటాలను ముంచి తీసిన తర్వాత గది వాతావరణంలో ఒక గోనె సంచీపైన ఆరబెట్టినా లేదా ఒక బుట్టలో వేసి ఉంచినా సరే కనీసం 25 రోజుల వరకు మనము ఎలాంటి స్థితిలో టమోట పండ్లను ద్రావణంలో ముంచి తీశామో అలాగే ఉంటాయి.

మార్కెట్‌లో టమోటాల ధర ఒక్కోసారి కిలో 100 రూపాయలుంటే, ఒక్కోసారి కేవలం రూపాయకే అమ్మాల్సి వుంటుంది. అలాంటప్పుడు రైతులు విపరీతంగా నష్టపోతారు. అలా ధర లేనప్పుడు ఈమె కనిపెట్టిన ద్రావణంతో ఇలా చేసి నిలువ వుంచుకుని, 25 రోజుల్లో మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకుంటే రైతుకు ఎంతో లాభసాటిగా ఉంటుంది. ఈ ద్రావణాన్ని కనుగొన్నందుకు మన ఇన్నోవేటర్ 'శ్రీమతి దూబ రాజు' ఈ పురస్కారాన్ని అందుకున్నారు.



సంపుటి-10 సంచిక - 1 నవంబర్ - డిశంబర్ 2021

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పైడిమర్రి చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**రేగులగడ్డ కల్పనా శాస్త్రి**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 400/-**
**for 2 years Subscription**

## ఈ సంచికలో.....


* ఇంధన ప్రత్యామ్నాయ 'పల్లెమిత్ర' బహుముఖ యంత్రం తయారు చేసిన ఇంజపూరి అంజయ్య - 4
* తెలుగు రాష్ట్రాల నాబార్డ్ సిజియం లు పాల్గొన్న 'పల్లెసృజన' 50వ వెబినార్ - 7
* ప్రకృతి వ్యవసాయానికి తోడుగా 'పల్లెసృజన'ఇన్నోవేషన్లు - 10
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణయువతకు స్వయం ఉపాధి - 14
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 18
* పరిష్కారం కోరుతున్న గొర్రెల కాపరి సమస్య! - 20
* రైతులు - వ్యవసాయం 'నాడు - నేడు' - 21
* ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం - 22
* 'పల్లెసజన'లో వికసించిన ముచ్చటైన మూడో "పద్మం" - 23
* వృక్షాయుర్వేదము - 24
* 10 వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు - 26
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 29
* స్పందన - 31


**కవర్ లోపలి పేజీల్లో ...**

'అంతర్జాతీయ పురస్కారాలు' అందుకున్న మన తెలుగు ఇన్నోవేటర్లు
అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

**మధ్య పేజీలో :**

నవంబర్ - డిశంబర్ 2021లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. -500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank,
Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# పల్లె ప్రజలు వలస దారులు పడుతున్నారా?

పల్లెప్రజల వలసదారులు మనందరికీ అవగతమే. స్వాతంత్య్రం వచ్చినప్పటినుండి గ్రామ ప్రజలు రకరకాల కారణాలతో పట్టణాల వేపు కొంతమంది, పని ఉన్నవేపు మరికొంత మంది, విదేశాలకు మరికొంత మంది ఇలా వలస జీవితం గ్రామాల్లో ఒక అలవాటుగా మారింది. ఇలా గ్రామ ప్రజలు ఊరు విడిచి వెళ్ళడానికి గత ఆరు దశాబ్దాలుగా తెలిసిన కారణాలు గ్రామాల్లో సరిపడా పని లేకపోవటం, వ్యవసాయం వర్షాధారం కావటం, పెద్ద కుటుంబాలు, చిన్న కమతాలు, కుటుంబమంతా ఉన్న భూమిపై ఆధారపడి బ్రతకటం కష్టమై, కొందరు వలస దారి పట్టడం, పట్టణాల్లో, ఫ్యాక్టరీల్లో, పెద్ద పెద్ద ప్రాజెక్టుల్లో ఉద్యోగాలు లభించటం, భివాండి, షోలాపూర్ లాంటి చిన్న పట్టణాల్లో నేత పరిశ్రమలు గ్రామస్తులను ఆకర్షించడం.... ఇలా రకరకాల సందర్భోచిత కారణాలతో గ్రామాలు వలసల వల్ల ప్రభావితం అయ్యాయి. ఈ వలసను తెలంగాణలో "బతక పోవటం" అనేవాళ్ళు, మగవాళ్ళు కుటుంబాలను విడిచి, ధనార్జనే ధ్యేయంగా పోయేవాళ్ళు, ఆ తర్వాత ధనార్జనకు అనుకూలంగా 70వ దశకంలో దుబాయి లాంటి మధ్య తూర్పు దేశాలకు తరళడం ప్రారంభమైంది. ముఖ్యంగా ఈ చర్చ తెలుగు వారికి సంబంధించిందే. కొంతమంది గ్రామస్తులు చదువుకొని, నైపుణ్యాలు సాధించి దేశ అభివృద్ధికై పరిశ్రమల్లో, ప్రభుత్వంలో, సైన్యంలో చేరడం వల్ల కూడా గ్రామాలను విడిచి వెళ్ళాల్సిన అవసరం గ్రామ ప్రజలకు వచ్చింది. దీన్ని మనం దేశాభివృద్ధికై పరిగణించవచ్చు, అయితే ఇలాంటి వలసల వల్ల గ్రామాల్లోని జీవన విధానాలు, వృత్తి పనులు వగైరాలకు ఎలాంటి లోటు లేకుండా కొనసాగారు. ఎనభయ్యవ దశాబ్దం వరకల్లా వలస జనాభా ఎక్కువై గ్రామాల్లో పనిచేసేవాళ్ళ సంఖ్య తగ్గడం మొదలైంది. వ్యవసాయ కూలీలు దొరకడం కష్టమైంది. ఈ వలసలు వర్షాధార ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించాయి. ఉభయ గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాల్లో వలసలు తక్కువగా ఉన్నట్టు అంచనా.

లాభకరమైన వ్యవసాయం గ్రామస్తులను ఊరికే పరిమితం చేయడానికి ఒక ప్రధాన కారణం అయితే రసాయన పంటలు ప్రారంభమై 9వ దశాబ్దానికి వచ్చేవరకల్లా వ్యవసాయంలో లాభాలు మెల్లిగా తగ్గటం, పెట్టుబడులు పెరిగిపోవటం - తద్వారా రైతుల అప్పులు మించిపోవటం - ఇలా ఒక విష వలయంలో రైతులు ఇరుక్కుపోయారు. ఈ కారణాల వల్ల కూడా వలసలు విస్తరించడం జరిగింది.



గతం 20 ఏళ్ళలో కొన్ని శుభ సూచనలు కనిపిస్తున్నాయి. గ్రామాల్లో నీటి వసతి పెరిగింది. వర్షాధార ప్రాంతాల్లో బోరు బావులు త్రవ్వడం వాటి ద్వారా రెండవ పంటను వేసుకోవడం చాలామంది పల్లె ప్రజలు ఊర్లకే పరిమితమయ్యారు. పట్టణాల్లో పనులకు నైపుణ్యత అవసరం కాబట్టి రైతులకు వలస అంత ఆకర్షణీయంగా లేదు. కాని గ్రామాల్లోని వృత్తికారుల వలసలు పట్టణాలకు ప్రారంభమయ్యాయి. దీంతో పల్లెల్లో వృత్తికారుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. మెల్లిమెల్లిగా వ్యవసాయ కూలీలు దొరకటం దుర్లభమైంది. యాంత్రికత వేపు పల్లెలన్నీ ఆశతో చూడటం ప్రారంభమైంది. ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, వీడర్లు స్ప్రేయర్లు విరివిగా గ్రామస్తులు వాడటం ప్రారంభించారు. వ్యవసాయంలో పశువుల వాడకం క్రమంగా తగ్గుతూ వచ్చింది. అయినా వ్యవసాయ కూలీల కొరత తీరలేదు. సన్న, చిన్నకారు రైతులకు ఇదొక పెద్ద సమస్యగా మారింది. దీనికి తోడుగా "ఉపాధి హామీ" పథకం రావటంతో వ్యవసాయ కూలీల సమస్య ఇంకా పెరిగింది. మొదటగా దొరకటం కష్టమైంది, ఆ తర్వాత కూలీ వేతనాలు కొండెక్కాయి. ఈ విధంగా పెట్టుబడి పెరగడంతో వ్యవసాయంలో లాభాలు క్రమేణా తగ్గుతూ వస్తున్నాయి. వింత ఏమిటంటే, కర్నూలు జిల్లాలో పల్లెసృజన వాలంటీరు వీరరాఘవ రెడ్డి సమాచారం ప్రకారం గ్రామాల్లోని కూలీలు పక్క గ్రామాలకు వ్యవసాయ పనులకు వెళ్ళడం, మరొక గ్రామం వాళ్ళు ఈ ఊరికి రావడం ప్రారంభమైంది. ఇలా ఎందుకు

జరుగుతుంది, వీటిని ఎందుకు అరికట్టలేక పోతున్నారో క్షుణ్ణంగా అవగాహన కావటం లేదు.

గత అయిదు సంవత్సరాలుగా గ్రామాల్లో వలసలు చాలా తగ్గిపోయాయి, కొన్ని గ్రామాల్లో అసలే లేవు అంటే కూడా నిజమే. ఈ శుభ పరిణామానికి కారణాలు వెతికితే దొరక్కపోవు.

ముఖ్యంగా నీళ్ళ వసతి ప్రతి గ్రామంలోనూ రెండు రాష్ట్రాల్లో చాలావరకు పెరగడం వల్ల, రైతులకు రెండు పంటలు పండించుకునే అవకాశం వలసలను ఆపుతుంది. రైతులకు మరే నైపుణ్యాలు లేవు కాబట్టి, వ్యవసాయాధార జీవనాన్నే ఎంచుకొని గ్రామాలకు పరిమితం అవుతున్నారు. రెండవ ప్రధాన కారణం రోడ్డు రవాణా వసతులు వీటివల్ల గ్రామాల్లో ఉంటూ పట్టణాల్లోని నూతన టెక్నాలజీలు, గృహ వసతులు, సిమెంటు ఇళ్ళు, వగైరాలు తమ గ్రామాలకు తీసుకు రావడం ప్రారంభించారు. గత దశాబ్దంలో అందరి చేతుల్లోకి సెల్‌ఫోన్ రావటంతో తమ స్వంత గ్రామాలను ఎందుకు విడిచి పెట్టాలో గ్రామస్తులకు తెలియకుండా ఉంది. గ్రామంలోని ప్రకృతి సౌఖ్యం పట్టణాల హంగులు రెండింటినీ గ్రామ ప్రజలు అనుభవించడం ప్రారంభించారు. ఇదొక మంచి పరిణామం. దీనికి తోడుగా ఐ.టి.లో పనిచేసిన ఎన్.ఆర్.ఐ.లు కాని, బాగా డబ్బు సంపాదించిన గ్రామ యువత వారి గ్రామాలపై శ్రద్ధ చూపటం మొదలెట్టారు. గత అయిదు సంవత్సరాల్లో లక్షకు పైగా ఇలాంటి ధనవంత యువత గ్రామాల్లోకి వెళ్ళి వ్యవసాయం ప్రారంభించడం మెల్లి మెల్లిగా ఫామ్ హౌస్ పేరిట గ్రామాల్లో నివసించడం తెలుగు రాష్ట్రాల్లో జరుగుతోంది. రాజకీయంగా కూడా సంక్షేమ పథకాల పేరిట గ్రామ ప్రజలకు ప్రభుత్వాలు నగదు పంచటం ప్రారంభించాయి. ఇలా సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సాంకేతిక పరిణామాలు గ్రామ ప్రజల వలసలను చాలావరకు తగ్గించాయని పల్లెసృజన విశ్వసిస్తోంది. చిన్న శోధయాత్రల్లో కూడా ఈ విషయం గ్రామ ప్రజలు వక్కాణించారు.

ఈ శుభ పరిణామం మన గ్రామాలను 'స్వయం సమృద్ధి' వేపు మరలిస్తాయా అన్నది వివాదాంశం. ఇది సాధించాలంటే, సంక్షేమ కార్యక్రమాలు, రైతుల పెట్టుబడులను తగ్గించేలా చేయాలి. ఉపాధి హామీ పథకాలు గ్రామ రైతులకు ఉపయోగ పడాలి. సన్న-చిన్నకారు రైతులకు కూలీల కొరత లేకుండా తక్కువ కూలీ ఖర్చుతో వ్యవసాయ కూలీలు లభించాలి. వారికి కావలసిన యంత్రాలు తక్కువ ధరలో స్థానిక టెక్నాలజీతో తయారై వారికి శ్రమ తగ్గించి, దిగుబడి పెంచేట్లుగా చేయాలి. రైతులు రైతుల కోసం తయారు చేసిన పరికరాలు, విత్తనాలు, చెట్లు, పశు వైద్యాలు, సేద్య పద్ధతులు వీరు విరివిగా వాడాలి. పల్లెసృజన వెతికి వెలికి తెచ్చిన పల్లె ప్రజల క్రియాశీలత వీరి సౌభాగ్యానికి తప్పక తోడ్పడుతుంది.

గ్రామ ప్రజల వలసలు తగ్గుముఖం పట్టడం శుభ సూచకం. ఈ అవకాశాన్ని సమాజం వ్యవస్థ సద్వినియోగం చేస్తూ మన గ్రామాలు పుష్కలానికి, స్వయం సమృద్ధికి చేరువవుతాయి అని పల్లెసృజన విశ్వాసం.

నూతన సంవత్సరంలో మనమంతా కరోనా పంజానుండి పూర్తిగా బయటకు రావాలని మనసారా ఆశిస్తూ.... 2022 నూతన సంవత్సర శుభాకాంక్షలతో....

భవదీయ
బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

# సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత పదిహేను సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరు తుందని భావించాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము. – ఎడిటర్

వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, సుభాష్ చందర్, 9652801700

# ఇంధన ప్రత్యామ్నాయ 'పల్లెమిత్ర' బహుముఖ యంత్రం తయారు చేసిన ఇంజపూరి అంజయ్య



- పల్లె వీరరాఘవ రెడ్డి

తెలంగాణ రాష్ట్రం లోని జగిత్యాల జిల్లా, ..... గ్రామానికి చెందిన సృజనాత్మక రైతు గతంలో కోతులను పొలం నుండి పార ద్రోలేందుకు ఒక అలారం తయారు చేసిన విషయం 'పల్లెసృజన' పాఠకులకు విదితమే. అదే స్ఫూర్తితో ప్రస్తుతం ఒక ఎలక్ట్రిక్ వీడర్‌ను రూపొందించాడు.

పెద్ద ట్రాక్టర్లు కొనలేని చిన్న, సన్నకారు రైతులు ప్రస్తుతం చేతితో నడిపించే వీడర్ల పట్ల మక్కువ చూపుతున్న విషయం అందరికీ విదితమే. మన ఇన్నోవేటర్లు తయారు చేస్తున్న వీడర్ల కొనుగోలును బట్టి ఈ విషయం అర్థమవుతోంది. కానీ రోజురోజుకూ పెరిగి పోతున్న పెట్రోల్, డీజిల్ ధరల వల్ల వాటి నిర్వహణ ఇప్పుడు రైతులకు భారంగా మారింది. ఈ విషయాన్ని పరిశీలించిన అంజయ్య తన మేథస్సుకు పని కల్పించి, ఇంధనంతో పనిచేసే వీడర్‌కు ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్ వీడర్‌ను రూపొందించాడు. ఈ వీడర్‌ను 3 గంటల పాటు కరెంటుతో ఛార్జింగ్ చేసినట్లయితే ఒకటి – ఒకటిన్న ఎకరాల ప్రత్తి, మిరప లాంటి పంటలలో అంతర సేద్యం చేసుకోవచ్చు. ఈ వీడర్‌తో కేవలం ముప్పావు గంటలోనే ప్రత్తి పొలంలో ఒక ఎకరం అంతర సేద్యం చేశారు.

ఈ వీడర్ చాలా తేలికగా వుంటుంది. ఎందుకంటే డీజిల్, పెట్రోల్ ఇంజన్‌లలా దీనికి ఉపయోగించిన బ్యాటరీతో నడిచే ఇంజన్ చాలా తక్కువ బరువులో వుంటుంది. కాబట్టి వీడర్ చాలా తేలికగా వుండి మహిళలు, ఎక్కువ శక్తి లేని రైతులు కూడా చాలా సులభంగా సేద్యాలు చేసుకోవచ్చు. పొలంలో పని చేయించుకోవటానికి భూమి యొక్క పరిస్థితిని బట్టి అవసరం అనుకుంటే బరువు కోసం దీనిపై పెద్ద రాయి, లేదా ఇసుక/ మట్టి నింపిన సంచిని దీనిపైన వేసుకుంటే తగిన బరువు వుండి పొలం పనులు చేసుకోవటం సులభం అవుతుంది.

ఈ వీడర్‌తో కేవలం పొలం పనులు చేసుకోవటమే కాదు, ఆరుగాలం ధాన్యం నూర్పిడి జరిగిన తర్వాత వాటిని ఎండబెట్టడం సహజం. అలా ఎండబెట్టిన ధాన్యాన్ని అప్పుడప్పుడూ మనిషి కాళ్ళతో ధాన్యాన్ని నెరుకుంటూ వుంటేనే ధాన్యం త్వరగా ఆరుతుంది. అలా ధాన్యం ఆరబెట్టేందుకు కూడా కాళ్ళతో నెరపాల్సిన పని లేకుండా ఈ వీడర్‌తోనే ధాన్యం కూడా నెరుపుకొని ఆరబెట్టుకోవచ్చు.

ఈ వీడర్ నడుపుతున్నంత సేపు పని చేస్తున్నపుడు దీనిలో అమర్చిన బ్యాటరీ దానంతట అదే ఛార్జింగ్ అయ్యేలా ఏర్పాటు చేశాడు అంజయ్య. కాబట్టి పొలం పనులు ఎక్కువ సేపు చేసుకునే అవకాశం వుంటుంది. ఇందుకోసం పెద్ద వాహనాల్లో ఏర్పాటు చేయటం వల్ల బ్యాటరీ ద్వారా బయటకు వెళ్ళే శక్తితో పని చేసే మోటారు వల్ల తిరిగి బ్యాటరీ కొంత ఛార్జింగ్ అయ్యే ఏర్పాటు చేశాడు. కాబట్టి ఒక్కసారి

ఛార్జింగ్ చేసుకుంటే దాదాపు 4-5 గంటల పాటు ఈ వీడర్‌తో పని చేయించుకోవచ్చు. దీనికే ఒక సౌరశక్తి (సోలార్ ప్యానల్) ఏర్పాటు చేసుకున్నట్లయితే ఇక పొద్దస్తమానం ఛార్జింగ్ చేసుకోవాల్సిన పని లేకుండా రోజంతా రైతు పొలం పనులు చేసుకోవచ్చు.

ఈ వీడర్ ఒకే చక్రం కలిగి వుంటుంది. దీనికే స్ప్రేయర్‌ను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. మధ్యనున్న సాలులో వీడర్‌ను నడుపుకుని వెళ్తుంటే ఇరువైపుల వున్న సాలుతో పాటు దాని ప్రక్కనున్న మరో రెండు సాళ్ళకు కూడా ఒకేసారి పురుగు మందు పిచికారి చేసుకోవచ్చు. అంటే ఒక్కసారి పొలంలోకి వెళ్తే 4 లేదా 6 సాళ్ళకు పురుగు మందు పిచికారి చేయవచ్చు అన్నమాట. ఈ వీడర్‌పై 25 లీటర్ల నీళ్ళ ట్యాంకును ఏర్పాటు చేసుకోవచ్చు. పురుగు మందు పిచికారి చేసుకునే సమయంలో ఈ వీడర్‌కు నీళ్ళట్యాంకు బరువును మోసేటపుడు బ్యాలెన్స్ తప్పకుండా ఉండేందుకు వీడర్ వెనక వైపున ఒక చిన్న చక్రాన్ని ఏర్పాటు చేసుకుంటే చాలు సునాయాసంగా వీడర్‌ను నడుపుకుంటూ పురుగు మందు పిచికారి చేసుకోవచ్చు. మరో విశేషమేమంటే ఈ స్ప్రేయర్ యొక్క ఎత్తును పెంచుకునే అవకాశం వుంది కనుక ప్రత్తి, మిరప ఇతర పంటలు ఒకటిన్నర మీటర్ల ఎత్తు వున్నా సరే పురుగు మందు సులభంగా పిచికారి చేసుకోవచ్చు. పురుగు మందు కొరకు మనిషి వీపుపైన ట్యాంకు వేసుకుని మోయాల్సిన అవసరం వుండదు. అటువంటప్పుడు రైతు ఎక్కువ పొలంలో పురుగు మందు పిచికారి చేసుకునే అవకాశం వుంటుంది. సాళ్ళ మధ్యలో వీడర్ వెళ్ళేటపుడు పెరిగి మొక్కల కొమ్మలు విరగకుండా పంటకు ఎటువంటి హాని కలుగకుండా ఉండేలా దీన్ని రూపొందించాడు అంజయ్య.

మోటార్ బరువు తక్కువగా ఉండటం వల్ల ఈ వీడర్‌పైన దాదాపు 30 కిలోల ఇసుక బస్తా వేసుకుని సేద్యం చేసినా రైతుకు ఎటువంటి అలుపు లేకుండా సునాయాసంగా పొలాన్ని దున్నుతుంది. బ్యాటరీతో పని చేసే మోటారు కాబట్టి ఎటువంటి శబ్ద కాలుష్యం, కుదుపులు, వైబ్రేషన్స్ లేకుండా చాలా అలవోకగా పని చేస్తుంది ఈ యంత్రం. పొలాన్ని రెండు నుండి రెండున్నర అంగుళాల మే లోతు దున్నగల శక్తి దీనికుంది. అంటే ఎద్దులతో సేద్యం చేసినట్లుగానే





వుంటుది. పెద్ద ట్రాక్టర్లను ఉపయోగించటం వల్ల భూమిపైన బరువు పడి నేల గట్టి బారకుండా తక్కువ బరువు గల ఇటువంటి వీడర్లతో సేద్యం చేసుకోవటం వల్ల పొలం త్వరగా గుల్లబారి పంటలు కూడా ఏపుగా పెరుగుతాయి. వర్షపు నీరు కూడా పొలంలోకి బాగా ఇంకిపోతుంది. అదే బరువైన ట్రాక్టర్లతో సేద్యం చేయటం వల్ల భూమి పొరలు కుచించుకు పోయి వర్షం పడ్డపుడు భూమి నీటిని ఇంకించుకోలేక పైపైనే పారి పోతుంది. బహుశా అందుకేనేమో ఇప్పుడు కొద్దిపాటి వర్షాలకే వరదలు ఉవ్వెత్తున వచ్చి చాలా నష్టాలకు గురి అవుతోంది దేశం.

ఈ వీడర్‌కు నిర్వహణా ఖర్చులు కూడా చాలా తక్కువ. ఇంజన్‌కు సంబంధించిన రిపేర్లు లేవు. డీజిల్, పెట్రోలు కొన వలసిన అవసరం లేదు. రేపు పొలానికి వెళ్ళే ముందురోజు రాత్రి ఒక్కసారి ఛార్జింగ్ చేసుకున్నట్లయితే చాలు పొలం పనులన్నీ చేసుకుని తిరిగి ఇంటికి రావచ్చు. తక్కువ బరువున్న యంత్రం కాబట్టి భూమిపైన ఎటువంటి భారం పడదు. భూమి పొరలు వదులుగా ఉన్నట్లయితే పంట వేరు వ్యవస్థ బాగా భూమి లోపలికి చొచ్చుకొని పోయి, ఎక్కువగా ఎదిగే అవకాశం వుంటుంది కాబట్టి దిగుబడి కూడా పెరిగడం సహజం. బ్యాటరీతో పని చేసే ఇంజన్ కాబట్టి ఎక్కువ శబ్దాలు ఉండవు. పవర్ స్ప్రేయర్‌కన్నా కూడా చాలా తక్కువ శబ్దం మాత్రమే చేస్తుంది. ఎటువంటి వైబ్రేషన్ ఉండదు కాబట్టి పనిచేసే మనిషి అలిసిపోయే అవకాశం చాలా వరకు తగ్గుతుంది. మనిషి అలిసిపోకుంటే ఇంకా ఎక్కువ పని చేసుకునే శక్తి ఉంటుంది. భుజంపైన మోసుకుంటూ పొలానికి తీసుకు వెళ్ళొచ్చు.

భూమి కాస్త పదునుగా ఉన్నపుడు పని చేసుకున్నట్లయితే వీడర్‌పైన ఎటువంటి బరువు బస్తాలు వేయాల్సిన అవసరం లేకుండా పొలంలో కలుపు నివారణ చేసుకోవచ్చు. పొలం గట్టి పడినప్పుడు మాత్రమే ఇసుక బస్తాలు లేదా బరువైన రాయి లాంటివి దీనిపైన వేసుకుని పని చేసుకోవాల్సి వుంటుంది. దానివల్ల దీన్ని నడిపే మనిషికి బరువేమీ ఉండదు. ఆ బరువు వల్ల వీడర్ ఇంకాస్త లోతుగా దున్న గలుగుతుంది. దీనిపైన 50 కిలోల బరువును ఉంచినా అవలీలగా నడుస్తుందని ప్రయోగాత్మకంగా నిరూపితమైంది.

'పల్లెసృజన' ఇన్నోవేటర్ అంజయ్యకు పూర్తి సహకారం అందిస్తుంది. జాతీయ స్థాయిలో దీని గుర్తింపుకై కృషి చేస్తుంది. రైతులు ఈ బహుముఖ 'పల్లెమిత్ర' యంత్రాన్ని వాడి, మీ అనుభవాలు పల్లెసృజనతో పంచుకుంటారని ఆశిస్తున్నాము.

**ఇన్నోవేటర్ అంజయ్య, ఫోన్ : 9502545571**

Honey Bee Network

gian

# Submit your Ideas, Innovations, Prototypes

## హనీబీ నెట్‌వర్క్
## క్రియేటివిటీ & ఇన్‌క్లూసివ్ ఇన్నోవేషన్ అవార్డులు
## HBN CRIIA

మీవద్ద మనుషులు, పశువులు, పర్యావరణం ఎదుర్కొనే దైనందిక సమస్యలను పరిష్కరించే సృజనాత్మక, సాంప్రదాయ పద్ధతులు లేదా ఆలోచనలు ఉన్నాయా?

**మీ ఆలోచనలను, ఇన్నోవేషన్‌లను, నమూనాలను పంపండి**

ఎవ్వరైనా దరఖాస్తు చేసుకోవచ్చు !

మీ దరఖాస్తులను ఈ చిరునామాకు పంపండి...
Email : gian@gian.org or post them to
GIAN, Bungalow No. 1,
Sattellite Complex, Nr. Mansi Crossroads,
Satellite, Ahmedabad – 380 015. Gujarat
Call us at : 079 26769686



మోటార్ సైకిల్‌తో పని చేసే పొలం దున్నే యంత్రం
మన్సుఖ్‌భాయ్ జగాని, గుజరాత్

ఎంపికైన ఆలోచనలు, నమూనాలను **HBN CRIIA** పురస్కారంతో సత్కరించటంతో పాటు, అవి కార్యరూపం దాల్చటానికి తగ్గ ఆర్థిక / ఇతర సహాయం కూడా చేయబడుతుంది.

చివరి తేది
31
ఆగస్టు,
2022

last date



ఎంత ఎత్తున్న విద్యార్థులైనా నీళ్ళు త్రాగటానికి వీలుగా వాలుగా ఏర్పాటు చేసిన కుళాయిలు.
ఛాయా ఠాకూర్, గుజరాత్.





24 నవంబర్, 2021 సాయంత్రం 7 గంటలకు 'పల్లెసృజన' తన వెబ్‌నార్‌ల పరంపరలో 50వ కార్యక్రమం నిర్వహించింది. దీనిలో అవిభాజిత తెలుగు రాష్ట్రాల విశ్రాంత చీఫ్ జనరల్ మేనేజర్ (సిజియం) పి. మోహనయ్య గారు, తెలంగాణ నాబార్డ్ సిజియం వై.కె. రావు గారు, ఆంధ్ర ప్రదేశ్ సిజియం సుధీర్ గార్లతో పాటు 'పల్లెసృజన' వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం, 'పల్లెసృజన' ఉపాధ్యక్షులు శ్రీకర్, 'పల్లెసృజన' పత్రిక ఎడిటర్ శశిమోహన్, సబ్ ఎడిటర్ వీరరాఘవ రెడ్డి, ఎన్.ఎ.ఆర్.ఎం. (నారమ్) విశ్రాంత అధికారి కల్పనా శాస్త్రి గారు, క్రియేటివ్ మైండ్స్ నిర్వాహకులు సుభాష్, ఇతర ముఖ్య వాలంటీర్లతో పాటు అనేక మంది ఇన్నోవేటర్లు, రైతులు పాల్గొన్నారు.


ముందుగా గణేశం గారు మాట్లాడుతూ పల్లెసృజన పని చేసే తీరు, దాని ఉద్దేశ్యాలు కుప్లంగా వివరిస్తూ "పునాది స్థాయి ఇన్నోవేటర్లకు వెన్నుదన్నుగా నిలిచే ఒక సహాయక వ్యవస్థ అవసరం ఎంతైనా ఉంది" అని చెప్పారు. సుభాష్ మాట్లాడుతూ భారతదేశంతో పాటు, యావత్ ప్రపంచాన్ని అతలాకుతలం చేసి మనిషిని మనిషి ముఖాముఖి కలుసుకో లేని పరిస్థితులు కల్పించిన 'కోవిడ్–19' రోజులలో తరచూ ప్రజలను కలిసే 'పల్లెసృజన' తన కార్యక్రమాలు ఏవిధంగా నిర్వహించాలి అన్న సమస్య వచ్చినపుడు దానికి ఉత్తమమైన మార్గం 'వెబ్‌నార్'లు అని నిర్ణయించడం జరిగింది. ఆ ప్రకారమే 14 అక్టోబర్, 2020 నుండి ప్రతి బుధవారం సాయంత్రం 7 గం.ల నుండి వెబ్‌నార్‌లు నిర్వహిం చడం, దానిలో రైతులను, ఇన్నోవేటర్‌లను, శ్రేయోభిలాషులను, అతిథు లను కలిపే ప్రయత్నం చేస్తూ నిర్విరామంగా ఇప్పటికి 49 వెబ్‌నార్ లను నిర్వహించామని, ఇది 50వది' అని చెప్పారు. ఇంతవరకు జరిగిన 49 వెబ్‌నార్‌లలో 97 మంది ఇన్నోవేటర్లు, 193 కొత్త ఆవిష్కరణలు, 54 మంది అతిథులు, ఎంతోమంది రైతులు పాల్గొన్నారని వివరించారు.

మోహనయ్య గారు పల్లెసృజన గురించి చెపుతూ "నాబార్డ్ లాంటి సంస్థల నుండి 'పల్లెసృజన'కు తప్పనిసరిగా సహాయం అందించాల్సి ఉంటుంది" అన్నారు. "ఇంత వరకు స్వచ్ఛందంగా మిత్రులు, శ్రేయోభిలాషుల సహాయంతో నడిచిన పల్లెసృజన కార్యక్రమా లు ముందుకు సాగాలి అంటే తప్పనిసరిగా నాబార్డ్ ఆర్థిక సహాయంతో పాటు, తన కార్యక్రమాలన్నిటిలో పల్లెసృజనకి ఒక పాత్ర కలుగజేయాలి" అన్నారు. "నాబార్డ్ నిర్వహించే దీనదయాల్ కౌశల్' కేంద్రాలు లాంటి ఇతర కార్యక్రమాలలో పల్లెసృజనకి కూడా పాత్ర కల్పించాలి" అని చెబుతూ, "ఏవిధంగా ఐతే అంతర్జాతీయ ఇన్నోవేషన్ డేగా అక్టోబర్ 26ను జరుపుకుంటున్నామో, అదేవిధంగా భారత దేశంలో కూడా 'గ్రామీణ ఇన్నోవేషన్‌ల రోజు' గా ఒక దినాన్ని కేటాయించి, ఘనంగా జరుపుకోవాలి" అని సూచించారు.

కార్యక్రమంలో వెంకట్రామి రెడ్డి, చంద్రశేఖర్, అల్లాడి ప్రభాకర్, వెంకటయ్య, అంజయ్య, శివకుమార్ షిండే, అశోక్ రెడ్డి, దూబ రాజు, రవి గౌడ్, మహిపాల్ చారి, శ్రీదేవి, అశోక్, షణ్ముఖరావు మొదలైన ఇన్నోవేటర్లు, రైతులు తాము ఈ వెబినార్‌లలో తరచూ పాల్గొన్నారని, మొత్తం కార్యక్రమాలు 'పల్లెసృజన'తో సంబంధం వున్న అందరికీ ఎంతో లాభసాటిగా ఉన్నదని చాలా చక్కగా క్రమపద్ధతితో నిర్వహించారని, ఈ కార్యక్రమాల వలన తమకెంతో మేలు జరిగిందని,







తమ వ్యాపారాలు కూడా పెరిగాయని, ఎన్నో కొత్త ఇన్నోవేషన్ల గురించి తెలుసుకో గలిగామని చెప్పారు.

తెలంగాణ నాబార్డ్ సిజియం వై.కె. రావు గారు ఈ వెబినార్‌లో పాల్గొంటూ..."పల్లెసృజన ఇన్నోవేషన్‌లు చాలా ముఖ్యమైనవి అని, సమాజానికి మేలు చేసేవి అని సరియైన పద్ధతిలో ముందుకు తీసుకు వెళ్ళ గలిగితే అందరికీ మేలు జరుగుతుందని చెబుతూ.... తాను ఈమధ్యనే 'కటంగూరు'లో పర్యటించినపుడు చిన్న రవాణా వాహనాన్ని చూశానని, తనకు చాలా నచ్చిందని అంటూ... సమాజానికి ఇన్నోవేషన్లు తప్పనిసరి అని, తాను ఆంధ్రప్రదేశ్ నాబార్డ్ సిజియం సుధీర్ గారితో చర్చించి, ఈ గ్రామీణ ఇన్నోవేటర్లకు నాబార్డ్ ఏవిధంగా సహాయం అందించ గలదో ఒక ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. నాబార్డ్ అప్పుడప్పుడు నిర్వహించే ప్రదర్శనలలో తప్పనిసరిగా 'పల్లెసృజన'కు స్టాల్స్ కేటాయించి, గ్రామీణ ఇన్నోవేటర్లకు ప్రోత్సాహకరంగా నిలుస్తాము అని, ప్రస్తుతం నాబార్డ్‌లో 'రూరల్ ఇన్నోవేషన్ ఫండ్' లేకపోయినా, అనేక ఇతర కార్యక్రమాలలో ఎంతోమంది ఇన్నోవేటర్లకు సహాయం అందించామని, ఇంకా అందిస్తామని చెప్పారు. నాబార్డ్ జాతీయ స్థాయిలో సుమారు 70 కోట్లు ఖర్చు పెట్టి 7 ఇన్నోవేషన్ సెంటర్లు (హబ్‌లు) నిర్వహిస్తోందని, అందులో రెండు తెలంగాణ లోనే ఉన్నాయని చెప్పారు.


మోహనయ్య గారు ఈ సలహాలకు స్పందిస్తూ నాబార్డ్ నిర్వహించే ఈ 'అగ్రి హబ్'లలో పల్లెసృజనకు సముచిత స్థానం కల్పిస్తే బావుంటుందని చెబుతూ పల్లెసృజన ఎంపిక చేసిన ఇన్నోవేటర్లకు, ఇన్నోవేషన్‌లకు ఈ అగ్రి హబ్ లలో వారు తమ సృజనలను రూపు దిద్దుకొని, మెరుగు పరిచే సదుపాయం కలుగజేయాలి అని చెపుతూ, అసలు తరచూ నాబార్డ్ అధికారులు ఎఫ్.పి.ఓ. గ్రూపులు పల్లెసృజన నిర్వహించే ఇన్నోవేషన్ డిఫ్యూజన్ సెంటర్ (ఐడిసి), ఇతర ఎగ్జిబిషన్‌లు సందర్శించాలని చెపుతూ, నాబార్డ్ తాము నిర్వహించే ప్రదర్శనలు, ఇతర




కార్యక్రమాలలో పల్లెసృజనకు, గ్రామస్థాయి ఇన్నోవేటర్లకు అవకాశం కల్పిస్తే నాబార్డ్‌కే కాదు, సమాజానికి కూడా మేలు చేసిన వాళ్ళము అవుతాము అన్నారు.

ఆంధ్రప్రదేశ్ నాబార్డ్ సిజియం సుధీర్ గారు పాల్గొంటూ.... తనతో పాటు ఈ వెబ్‌నార్‌లో తన సహాయక అధికారులు కూడా కొందరు ఈ వెబ్‌నార్‌లో పాల్గొంటున్నారని చెబుతూ తాను ఈ వెబ్‌నార్ లో కొన్ని ఇన్నోవేషన్‌లు ప్రదర్శిస్తారని ఊహించానని, కానీ సమాభావం వలన, ఈ ప్రత్యేక వెబినార్ ఉద్దేశ్యం అది కాకపోవటం వలన బహుశా ఇన్నోవేషన్‌లు ప్రదర్శించలేదని తాను ఊహించానని చెప్పారు. పల్లెసృజన ఎప్పుడైనా, ఎక్కడైనా ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో తన కార్యక్రమాలు నిర్వహించినా, ప్రదర్శనలు నిర్వహించినా ముందుగా వివరాలు తెలియజేస్తే వీలైనంత వరకు నాబార్డ్ అధికారులు వాటిలో పాల్గొనే ఏర్పాటు చేయగలనని, తద్వారా పల్లెసృజన, ఇన్నోవేటర్లు, రైతులు, నాబార్డ్ అధికారులు తరచూ కలుసుకునే అవకాశం ఉంటుంది అన్నారు. దీనికి నాందిగా విజయవాడలో డిశంబర్ 29వ తేదీన జరిగ బోయే వ్యవసాయ మేళాలో పల్లెసృజన పాల్గొనే అవకాశం కల్పిస్తానని అన్నారు. పల్లెసృజన కార్యక్రమాలు గురించి తెలుసుకొన్న నేను హైదరాబాద్ లోనే కాక, ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో కూడా ఎక్కడైనా ఒక శాశ్వత ఐడిసి ఏర్పాటు చేస్తే అందరికీ సానుకూలంగా ఉంటుంది అని చెపుతూ తనకి పల్లెసృజన కొత్తగా పరిచయం అయిందని, అది చేసే కార్యక్రమాలు నాబార్డ్ ఉద్దేశ్యాలు చాలా దగ్గరగా ఉన్నాయని, భవిష్యత్ లో ఎంత వీలైతే అంత దగ్గరగా ఈ రెండు సంస్థలు కలిసి పనిచేసే అవకాశాలు వెతుకుదామని చెప్పారు. గ్రామీణ ఇన్నోవేషన్‌ల గురించి ప్రస్తావిస్తూ మనము ఎన్ని చేయ గలిగినా, ఒక స్థాయి వరకు చేయగలమేమో కాని, పెద్ద స్థాయిలో ఉత్పత్తి అమ్మకాలు చేయాలంటే నాబార్డ్ తో పాటు ఇతర వాణిజ్య సంస్థల సహాయమూ తీసుకోవలసి ఉంటుందేమో అన్నారు.

ఈ దశలో మోహనయ్య గారు కొన్ని సూచనలు చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నాబార్డ్ అధిపతులు పల్లెసృజనకు చేయూతను ఇవ్వటానికి సుముఖంగానే ఉన్నపుడు పల్లెసృజన చేసే కార్యకలాపాలు, ఇన్నోవేషన్ల వివరాలు, ఇన్నోవేటర్ల వివరాలు మొదలైనవి అన్నీ జోడించి, ఒక వివరణాత్మక కరదీపిక (బ్రోచర్) తయారు చేయడంలో నాబార్డ్ సహాయం చేస్తే బావుంటుందని అన్నారు. బ్రోచర్ పల్లెసృజన చేసుకో గలదు కాని, దానిని ముద్రించడానికి తగ్గ ఆర్థిక సహాయం ఏర్పాటు చేయ గలిగితే పల్లెసృజన ఉద్దేశ్యాలతో పాటు, నాబార్డ్ ఉద్దేశ్యాలు సాధించటానికి తోడ్పాటుగా ఉంటుంది అన్నారు. అదేవిధంగా పల్లెసృజన వద్ద వున్న అపారమైన పల్లె జ్ఞానాన్ని, పల్లెస్థాయి ఇన్నోవేషన్ల







వివరాలను సామాన్య ప్రజల దాకా చేరవేయడానికి దోహదపడే పల్లెసృజన పత్రికను, దాని సర్క్యులేషన్‌ను పెంచటానికి నాబార్డ్ తన అనుబంధ సంస్థలు, తెలిసిన వారు, ప్రాథమిక వ్యవసాయ సంఘాలు అన్నిటికీ కూడా చాలా ఉపయుక్తంగా ఉండే ఈ పత్రికను అందజేసే ఏర్పాట్లు చేస్తే బావుంటుందని, తప్పకుండా ఈ పత్రికకు చందాదారులుగా చేరమని స్నేహపూర్వక ఆదేశం ఇస్తే బావుంటుందని చెప్పారు. ఈ దశలో కల్పనా శాస్త్రి గారు తమ అభిప్రాయంగా..... నాబార్డ్ నడిపే అగ్రి హబ్ లలో 'పల్లెసృజన'కు ప్రాముఖ్యత ఇస్తూ గ్రామీణ ఇన్నోవేషన్‌లకు చేయూతను ఇవ్వటానికి ప్రత్యేకమైన బడ్జెట్‌తో పాటు, నిధుల కేటాయింపు ఉంటే బావుంటుంది అన్నారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా వున్న అనేక మంది గ్రామీణ స్థాయి ఇన్నోవేటర్లు, వారు గ్రామాలలో రైతులు, ఇతర ప్రజలు ఎదుర్కొనే అనేక స్థానిక సమస్యలకు పరిష్కారాలు కనుగొంటూ, తమకు తోచిన విధంగా తోడ్పడుతూ ఉంటే వారికి అండగా నిలిచిన పల్లెసృజన సమాజానికి చేస్తున్న ప్రత్యేకించి గ్రామీణ స్థాయి జ్ఞానము, సృజనలు గుర్తించటము, వివరాలు సేకరించటము, గ్రంథస్తం చేయటము, వాటిని మెరుగు పరిచే అవకాశాలు కల్పించటము, ధృవీకరించటము, సముచిత స్థాయిలో 'పద్మశ్రీ' ల నుండి 'రాష్ట్రపతి గారి పురస్కారాలు' అందుకోవటంతో పాటు అనేక అంతర్జాతీయ, జాతీయ, స్థానిక స్థాయిలలో గుర్తింపు తేవటానికి స్వచ్ఛందంగా ఏ సంస్థాగత సహాయమూ లేకుండా పాటుపడుతూ ఉంటే, నాబార్డ్ లాంటి గొప్ప సంస్థలు ఇతర వాణిజ్య సంస్థలు తమవంతు చేయూత అందిస్తే సమాజానికి, దేశానికి మేలు చేసిన వాళ్ళము అవుతామని అన్న ఆలోచనతో ఆరోజు కార్యక్రమం ముగిసింది.

'పల్లెసృజన' ఈ వెబినార్‌లో చర్చించిన అంశాలపై ఈ క్రింది విధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

1. పునాది స్థాయి ఇన్నోవేషన్లను పరిశీలించడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నాబార్డ్ సి.జి.యం.లను 'పల్లెసృజన' కార్యాలయానికి ఆహ్వానించడం.
2. ఇన్నోవేషన్ల నూతన బ్రోచర్‌లను రెండు రాష్ట్రాల నాబార్డ్ సంస్థల సహాయంతో ముద్రించడం
3. ఇన్నోవేటర్లకు అవసరమైన నిధులు సమకూర్చడానికి ఒక్కో రాష్ట్రం నుండి 5 మంది ఇన్నోవేటర్లను, వారి ఇన్నోవేషన్ల వివరాలను, నమూనా దశలో వున్నవి, అమ్మకానికి సిద్ధంగా ఉన్న వాటిని గురించిన రెండు రాష్ట్రాల సిజియం లకు తెలియజేటం.
4. ఎఫ్.పి.ఓ.లు మరియు నాబార్డ్ సిబ్బందితో వెబినార్‌లను తరచుగా నిర్వహించడం.
5. ఎఫ్.పి.ఓ.ల వద్దకే వెళ్ళి 'పల్లెసృజన' ఇన్నోవేషన్లను ప్రదర్శించడం.
6. ఆంధ్రప్రదేశ్‌లో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రాన్ని (ఐడిసి) నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ సహాయంతో ఏర్పాటు చేయడం.
7. నాబార్డ్ సిబ్బందికి 'పల్లెసృజన' పత్రికను ఇంగ్లీషులో అనువదించి, ఆన్‌లైన్‌లో షేర్ చేయడం.
8. సంవత్సరంలో ఒక రోజు 'రూరల్ ఇన్నోవేషన్ డే' గా నిర్ణయించడం.
9. విధానపరమైన సూచనలు చెయ్యాలి.
10. కస్టం హైరింగ్ కేంద్రాలలో గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లను చేర్చడం.


## పల్లెసృజన
## చిన్న శోధయాత్ర – జ్ఞాన యాత్ర

**40వ "చిన్న శోధయాత్ర - జ్ఞాన యాత్ర"**

**24-27 ఫిబ్రవరి 2022 తేదీలలో నిర్వహించ బడుతుంది.**

పాల్గొనాలనే ఉత్సాహమున్న వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకో గలరు.

**అంజిరెడ్డి, ఫోన్ : 99666 46276,**

**బ్రిగేడియర్ పోగుల గణేశం, 9866001678**

లేదా వెబ్‌సైట్ : http://pallesrujana.org ని సందర్శించి వివరాలు తెలుసుకో గలరు.

# ప్రకృతి వ్యవసాయానికి తోడుగా 'పల్లెసృజన' ఇన్నోవేషన్లు

'పల్లెసృజన' స్వచ్ఛంద సేవకులు, సేవా సంస్థ మన రెండు తెలుగు రాష్ట్రాల్లో పని చేస్తోంది. పల్లెసృజన యొక్క గ్రామీణ ప్రజల పునాది స్థాయి ఆవిష్కరణలు ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు ఏవిధంగా ఉపయోగ పడతాయి? ప్రస్తుతం దేశంలో ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ పద్ధతులు రెండు విధాలుగా చేస్తున్నారు రైతులు. అవి 1. రసాయనాలు, హైబ్రిడ్ విత్తనాలతో కూడిన వ్యవసాయం, 2. దేశీ విత్తనాలు, ప్రకృతి పద్ధతిలో చేస్తున్న వ్యవసాయం.

మన రైతుల్లో పెద్ద కమతాలు అంటే 2 హెక్టార్లకు పైగా భూమి కలిగిన రైతులు చాలా తక్కువ మంది ఉన్నారు. అదేవిధంగా రెండు హెక్టార్ల కు లోపు పొలం కలిగిన రైతులు ఎక్కువ మంది ఉన్నారు. పెద్ద కమతాలు కలిగిన రైతులు ట్రాక్టర్ వంటి భారీ యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. అదేవిధంగా చిన్న, సన్నకారు రైతులు కూడా అదే భారీ యంత్రాలను కొనుగోలు చేసి, లేదా కిరాయికి తీసుకుని వాడుకుంటున్న రైతులు కొంతమంది ఉన్నారు. భారీ యంత్రాలను కొనటానికి 7 నుంచి 8 లక్షల రూపాయలు కనీసం ఖర్చవుతాయి. పైగా నిర్వహణ, ఇంధనం ఖర్చులు అదనం. 5 ఎకరాల లోపు పొలం కలిగిన రైతులకు 50 వేల రూపాయల లోపు ఖరీదులో లభించే చిన్న పరికరాలు చాలు. నిజమైన రైతు గురించి అంటే కష్టపడే చిన్న రైతు గురించి తెలియజేస్తున్నాను.

ఇందుకు తోడు రసాయన వ్యవసాయ పద్ధతులు చిన్న, సన్న కారు రైతులను చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పంటలకు చాలా రకాల పెట్టుబడి అవసరాలు పెరిగి, మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించక తను, తన కుటుంబం ఆర్థిక, అనారోగ్య పరిస్థితుల్లో నిర్జీవమై, నిస్సత్తువలో బ్రతుకును వెళ్ళదీస్తున్నాడు. రసాయన వ్యవసాయం ప్రకృతి వనరులను విధ్వంసం చేస్తున్నది, పర్యావరణాన్ని క్షీణింప జేస్తున్నది. వాతావరణ కాలుష్యాన్ని పెంచి ప్రకృతి జీవావరణము యొక్క ఉనికిపై ప్రభావం చూపుతుంది. మనుష్య, పశు పక్ష్యాదులు, వన్య మృగాల జీవన విధానాల్లో ఆరోగ్యాలపై ఎలాంటి దుష్ప్రభావాలను చూపుతోందో మనకు తెలుసు.

> పెద్ద ట్రాక్టర్‌లు దాదాపు 4 టన్నులకు పైగా బరువుంటాయి. అందువలన భూమి పైపొరపై అధిక వత్తిడి పడి భూమి లోపల గట్టితనము ఏర్పడుతుంది. దీని వలన సూక్ష్మజీవులు, వాన పాములు ఏర్పరచిన భూ సూక్ష్మ రంధ్రాలు మూసుకుపోయి, వర్షపు నీరు భూమిలోపలికి ఇంకనివ్వదు.

ఇలాంటి పరిస్థితుల్లో పురాతన వ్యవసాయ పద్ధతులైన దేశీ విత్తనాలతో మిశ్రమ పంటల సేద్యంతో తక్కువ నీటి వనరులతో మరియు వాననీటి సంరక్షణ, సహజంగా ఎలా జరుగుతుందో పై విధంగా ఎలా పంటలను పండించవచ్చో, అలా పండించి చూపుతున్నారు ప్రకృతి వ్యవసాయ రైతు శాస్త్రవేత్తలు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సూక్ష్మ జీవులు, వాన పాములు, దేశీ విత్తనాలు, మిశ్రమ పంటల నిర్వహణ, మిత్ర కీటకా లు, పరపరాగ సంపర్కము చేయు కీటకాలు మరియు ప్రకృతిలో గల వృక్ష సంబంధ కషాయాలు తేమను నిలుపగల వ్యవస్థ ఏర్పాట్లు ఇవి చాలా ముఖ్యము. వీటివలన మాత్రమే ప్రకృతి సేద్యపు పద్ధతులలో పంటలను పండించ గలుగుతారని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తలు పండించి నిరూపిస్తు న్నారు. ఈ వ్యవసాయ పద్ధతులలో మాత్రమే పర్యావరణ రక్షణ, జీవావరణ రక్షణ సాధ్యపడి మనుష్య, పశు, పక్ష్యాదు లు వ్యమృగాలు, జంతుజాలము, కీటకాలు మొదలైనవి సమస్తం ప్రకృతి జీవావరణ ముల మీద జీవనము ఆధారపడి ఉన్నది.




మన గ్రామాలు బాగు పడాలంటే గ్రామాల డబ్బు గ్రామాలలోనే ఉండాలి. పట్టణాల డబ్బు గ్రామాలకు రావాలి అంటే పైవిధంగా ప్రకృతి వ్యవసాయం చెయ్యాలి. రసాయన వ్యవసాయం మన సంపదను దేశం వెలుపల గల బహుళజాతి కంపెనీల కు పంపిస్తుంది. మన గ్రామాల నుండి సంపద బైటకు వెళ్తుంది.

ఇంకొక ముఖ్యమైన విషయం ఏమిటంటే ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యవసాయం భూమి ఏవిధంగా ఉండాలో నిర్వహించాలో చేబుతున్నారు. వ్యవసాయ భూ భాగాలపై భారీ యంత్రాలైన పెద్ద ట్రాక్టర్‌లతో దుక్కులు ఏవిధంగానూ నడపరాదు. దీనికి గల కారణం మన వ్యవసాయ భూమిలో ఒక చదరపు అడుగు 32 కిలో గ్రాముల బరువు కలిగిన వాటి వలన మన వ్యవసాయ భూమి నిర్మాణము పాడవదు అని సుభాష్ పాలేకర్ గారు అన్నారు. మరియు భూమి పైనుంచి 4 నుండి 5 అంగుళాల లోపున మాత్రమే వ్యవసాయ భూములను ఎద్దు, అరకలతో కాని చిన్న యంత్ర పరికరాలు అంటే 200 నుండి 300 కిలోల బరువు కలిగిన యంత్రాలతో కూడిన గొర్రు, గుంటకలతో సేద్యం చేసుకోవాలి. ఈవిధంగా సేద్యపు పద్ధతులను అనుసరిస్తే భూమిపై పెద్ద వత్తిడి లేకపోవటం వలన సారవంతమైన మట్టిని రక్షించుకోవచ్చు. అంటే పెద్ద ట్రాక్టర్‌లు దాదాపు 4 టన్నులకు పైగా బరువుంటాయి. అందువలన భూమి పైపొరపై అధిక వత్తిడి పడి భూమి లోపల గట్టితనము ఏర్పడుతుంది. దీనివలన సూక్ష్మజీవులు, వానపాము లు ఏర్పరచిన భూ సూక్ష్మ రంధ్రాలు మూసుకుపోయి, వర్షపునీరు భూమిలోపలికి ఇంకనివ్వదు. అందుకే వ్యవసాయ భూమిపై వర్షపునీటి ప్రవాహం పెరిగి సారవంతమైన మట్టిని తీసుకుపోవటం వలన భూ క్షయం జరుగుతోంది. అందుకే పోషకాలు, సేంద్రియ







పదార్థం అంతా వెళ్ళిపోయి నిర్జీవమైన మట్టి మాత్రమే మిగులుతోంది. అంతే కాకుండా వర్షపునీరు సహజమైన పద్ధతులలో మాత్రమే అంటే దేశీయ వానపాములు భూమిలో ఏర్పరచిన భూమి పైనుంచి 15 అడుగుల లోతు వరకు 'డబ్ల్యు' (W) ఆకారంలో సంచరిస్తూ జీవిస్తాయి. ఈ విధంగా ఏర్పడిన రంధ్రముల వలననే వర్షపు నీరు భారీగా భూగర్భంలోకి ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయి. పెద్ద ట్రాక్టర్‌లు వాడటం వలన వానపాములు ఉనికి లేకుండా పోవటం వలన సూక్ష్మ జీవులు ఏర్పరచిన 'హ్యూమస్' పదర్థాంతో చాలా దుష్ఫలితాలు ఉంటాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది. పంటలు రోగ నిరోధక శక్తిని కోల్పోయి, మట్టికి తేమను నిలుప గలిగే పోషకాలను స్థిరీకరించే వ్యవస్థ లేక పోవటం వలన పంటలకు సరియైన పోషకాలు కావాల్సిన పరిమాణంలో అందక పంట ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. పంటలు చీడపీడలను తట్టుకోలేక, తెగుళ్ళను నిరోధించు కోలేక పండకుండా మొద్దుబారి పోయిన పరిస్థితులను మనము ప్రస్తుతం చూస్తున్నాము.



కనుక మన వ్యవసాయం బాగుపడాలంటే ముందుగా తక్కువ బరువు కలిగిన యంత్ర పరికరా లను ఉపయోగించుకొని చేసుకోవటం ఉత్తమం. ఇందుకు కావలసిన చిన్న పరికరాలు అంటే గొర్రు, గుంటకలతో సేద్యం చేసుకోవచ్చు. యంత్రాలతోను మరియు మానవ శ్రమతో లాగే పరికరాలతోను వివిధ వరుసలలో విత్తనాలను విత్తుకోవచ్చు. వరి, చిరు ధాన్యాలు, పుష్పాలు, మిరప, ప్రత్తి, వేరుశనగ మొదలైన విత్తనములను విత్తుకోవటానికి విత్తన పరికరములు మరియు టమోట, వంగ, బంతి, మిరప మొదలైన నారు నాటే పరికరాలతో అతి తక్కువ మంది కూలీలతో నిర్వహించుకోవచ్చు. పంటల వరుసల మధ్య వచ్చు కలుపు నివారణకు అవే చిన్న యంత్ర పరికరాలు లేదా తక్కువ భూమి ఉన్నట్లయితే చేతుల తో లాగే గొర్రు, గుంటకలను ఉపయోగించి, కలుపు నివారణ చేయ వచ్చు. ఇవన్నీ 'పల్లెసృజన' పునాది స్థాయి ఆవిష్కరణలలో ముఖ్యమైనవి. అంతే కాకుండా పంటలపై వచ్చు చీడ పీడల నివారణకు, పెరుగుదలకు అవసరమైన వృక్ష సంబంధ కషాయాలు, వరిలో కలుపు నివారణ మరియు పండ్ల తోటల్లో నిమటోడ్స్ నివారణకు నిరూపితమైన మందులను పల్లెసృజన పునాది స్థాయి ఆవిష్కరణలలో భాగమై ఉన్నవి. మంచి ఫలితాలను ఇస్తున్నాయి.



పంటలపై వచ్చు చీడపీడల నివారణకు స్ప్రేయర్లు, సోలార్ శక్తితో నడిచేవి మరియు అభివృద్ధి చేసిన బ్యాటరీలను ఉపయోగించి మరియు తీగజాతి పంటలకు మరియు టమోట లాంటి పంటలకు కావాల్సిన నిలువ వరుస పందిరుల కొరకు వెదురు బొంగులు ఉపయోగించి నిర్మాణాలు చేపట్టవచ్చు. ఈ బొంగులపై పటిష్టమైన కోటింగ్ చేసి ఉండటం వల్ల ఎక్కువ కాలం మన్నుతాయి.

వరికోత, నూర్పిడి యంత్రాలు, చిరు ధాన్యాలు, పప్పు ధాన్యాలు, వేరుశన నూర్పిడి యంత్రాలు మరియు మిరప, వేరుశనగ, మొక్కజొజన్న విత్తనాల ను ఒలిచే యంత్రాలు అతి తక్కువ ఖర్చుతో పచ్చి గడ్డిని ముక్కలుగా చేసే యంత్రాలు మానవ శక్తితో నిర్వహించుకోవచ్చు.

ప్రకృతి వ్యవసాయంలో పండించు వివిధ దేశీయ వరి జాతుల్లో గల లావులు, సన్నాలు, అతి సన్నాలు, దేశీ వరిజాతి వడ్లను మరియు చిరు ధాన్యాలను మిల్లింగ్ చేయు యంత్ర పరికరాలను




నిర్వహించుట అతి సులభము. తక్కువ ఖర్చులో లభిస్తుంది. సమర్ధవంతంగా మిల్లింగ్ చేసి జల్లెడ చేసి, ఎలాంటి మట్టి, రాయి, ఇసుక, చెత్త, కల్తీలు లేని బియ్యాన్ని ఇవ్వగలవు. ఇవి కూడా పల్లెసృజన పునాది స్థాయి వ్యవసాయ ఆవిష్కరణ లలో అతి ముఖ్యమైనవి. పైవన్నీ ప్రకృతి వ్యవసాయము లేదా రసాయన వ్యవసాయం లోని రైతులందరికీ అవసరమైనవే. గ్రామాలలోని రైతుల శ్రేయస్సు కోరి చేసిన ఆవిష్కరణలను పల్లెసృజన బాధ్యత తీసుకొని అందరికీ చేరుస్తుంది.

**'పల్లెసృజన' పునాది స్థాయి ఆవిష్కర్తల గురించి.....**

ఈ ఆవిష్కరణలను కనుగొన్న ఆవిష్కర్తలు గ్రామాలలో నివసిస్తూ తమ ప్రధాన జీవన వృత్తులలోను మరియు వారివారి గ్రామాల లో ఉన్న వివిధ ప్రధాన జీవన వృత్తులలోను ఎదురయ్యే శారీరక ఇబ్బందులను నివారించి, సకాలంలో సత్వరము పనులు పూర్తి చేసుకునే విధంగా గ్రామీణ పునాది స్థాయి ఆవిష్కరణలను గ్రామీణ ప్రజలే ఆవిష్క రించుకున్నారు.

పునాది స్థాయి ఆవిష్కరణలు అంటే ఎలాంటి సాంకేతిక విజ్ఞాన అక్షర జ్ఞానం కూడా లేనివారు. అయినా వారి అనుభవ మేథో సంపత్తితో రూపొందించిన గ్రామీణ పునాది స్థాయి ఆవిష్కరణలు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి.

క్షేత్రంలోని సమస్యలను పరిశీలిస్తూ క్షేత్రంలోనే ఉంటూ, అత్యాధునిక యంత్ర పని స్వభావాన్ని అర్థం చేసుకొని తమచుట్టూ వున్న పనికిరాని పనిముట్లతో ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు చేయలేని అరుదైన ప్రభావవంతమైన ఆవిష్కరణలను సమస్యానుభవ మేథోశక్తితో, తక్కువ ఖర్చుతో, తక్కువ ఇంధనంతో పరికరాల వాడుకలో క్లిష్టమైన మరమ్మ త్తులు వచ్చినా రైతులు తమ పరిధిలోనే సరిచేసుకునే విధంగా, లాభాపేక్ష లేని అతి తక్కువ ధరలకు అత్యద్భుతమైన, అత్యవసరమైన వ్యవసాయ పరికరా లను రూపొందించి చిన్న, సన్నకారు రైతులు సైతం కొనుగోలు చేయు ధరలకు ఇస్తున్నారు. కుటుంబ ఆర్థిక, వైద్య, విద్యా పరిస్థితులను కొనసాగిస్తూ ఇలాంటి ఆవిష్కరణలను మన రైతన్నలకు ఇవ్వాలనే సంకల్పంతో ఉన్నారు. ఇందుకుగాను పల్లెసృజన తనవంతు తోడ్పాటును అందిస్తోంది.

'పల్లెసృజన గ్రామీణ పునాది స్థాయి ఆవిష్కరణలు ప్రకృతి వ్యవసాయానికి ఒక వరం.

**– మద్దినేని వెంకటేశ్వర రావు,**
ప్రకృతి వ్యవసాయ రైతు, కోదాడ, ఫోన్ : 8106868949

# గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లపై వీక్లీ వెబినార్‌లు

అక్టోబర్ 2020 నుండి ప్రతి వారం నిర్వహించ బడుతున్నవి.
ఇప్పటి వరకు

**52 వెబినార్లు నిర్వహించడం జరిగింది**
**197 ఇన్నోవేషన్లు పరిచయం చేయబడినవి**
**99 మంది ఇన్నోవేటర్లు,**
**60 మంది అతిథులు పాల్గొనటం జరిగింది.**

**ఇన్నోవేటర్లు తమ ఆవిష్కరణలు (ఇన్నోవేషన్) వీడియోల ద్వారా ప్రదర్శిస్తారు.**

**ప్రతి బుధవారం**

**రాత్రి 7 గం.ల నుండి 8-15 ని.ల వరకు**

నిర్వహించ బడుతుంది.

పాల్గొనాలి అనుకునేవారు **ఈ క్రింది లింకుల ద్వారా మీ మొబైల్ లేదా కంప్యూటర్ లో** పాల్గొనవచ్చు.

**అందరూ ఆహ్వానితులే.**

Google meet link : **https://meet.google.com/mrj-seot-ntq**

వెబినార్లలో పాల్గొనలేని వారు యూట్యూబ్ ఛానల్ లో అన్ని వెబినార్‌లను మీకు వీలున్నపుడు చూసుకోవచ్చు.

youtube live : **https://youtu.be/NVgUnpmUdK8**

# పల్లెసృజన

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

'పల్లెసృజన' ఒక స్వచ్ఛంద సంస్థ. దీని నిర్వాహకులు, వాలంటీర్లు అంతా స్వచ్ఛందంగా పనిచే స్తారు. గ్రామాల్లోవున్న సృజనాత్మకతను వెతికి, సమాజానికి తెలియపరచడం, సృజనాత్మకత గల వ్యక్తులను (ఇన్నోవేటర్స్‌ను) గౌరవించి వారిని ప్రపంచానికి పరిచయం చేయాలన్న ప్రధాన లక్ష్యంతో 2005లో 'పల్లెసృజన' స్థాపించబడింది. చదువుకోని గ్రామ ప్రజల్లో కూడా శాస్త్రవేత్తలు ఉన్నారని త్రికరణశుద్ధిగా నమ్ముతుంది 'పల్లెసృజన'. అలాంటి జ్ఞానవేత్తల జ్ఞానాన్ని గుర్తించి, గ్రంథీకరించి, ఆ జ్ఞానాన్ని సమాజానికి అందించటంతో పాటు ఆ జ్ఞానకర్తను సమాజం గుర్తించేలా చేయటం 'పల్లెసృజన' ప్రధాన కార్యక్రమం. జ్ఞానశోధనకై 'పల్లెసృజన' ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి 3 రోజుల పాటు మారుమూల గ్రామీణ ప్రాంతాల గుండా కేవలం ప్రకృతిని ఆస్వాదిస్తూ, జ్ఞానాన్ని వెతుక్కుంటూ సాగుతుంది 'చిన్నశోధయాత్ర'.

అలాంటి 'చిన్న శోధయాత్రలు' ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వున్న 'పల్లెసృజన' అభిమానులు, వాలంటీర్ల సహకారంతో సేకరించిన 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'ను "పల్లెసృజన" పత్రిక ద్వారా వెలుగులోకి తీసుకు రావటంతో పాటు జాతీయ స్థాయిలో "నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్", "హనీబీ నెట్‌వర్క్" లాంటి సంస్థలతో మమేకమై సేకరించిన జ్ఞానాన్ని గ్రంథస్థం చేస్తుంది. అలా వారి జ్ఞానానికి గుర్తింపు తీసుకు వచ్చే ప్రయత్నంలో ప్రారంభం నుంచి నేటి వరకు ముగ్గురు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్స్‌కు "పద్మశ్రీ" పురస్కారాలు, 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్" (ఎన్.ఐ.ఎఫ్.) ద్వారా 14 మంది గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్స్‌కు 'రాష్ట్రపతి పురస్కారం', నలుగురు ఇన్నోవేటర్లకు అంతర్జాతీయ పురస్కారాలతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు ఎందరో ఇన్నోవేటర్లకు అందించటం ద్వారా వారికి సమాజంలో సమున్నత స్థానాన్ని కల్పించగలిగింది.

ఇలా తయారైన ఇన్నోవేషన్లను "క్రియేటివ్ మైండ్స్" మరియు అను బంధ సంస్థల సహకారం తో వాటిని ప్రజలకు చేరవేసేలా చర్యలు చేపట్టింది "పల్లెసృజన".

దేశీయ జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకువచ్చి, దేశీయ జ్ఞానంతోనే ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుంది అని నిరూపించాలన్నదే "పల్లెసృజన" సంకల్పం.

**అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు....**

| | | |
|---|---|---|
| ❀ సీడర్లు (6),<br>❀ వీడర్లు (14),<br>❀ రొటోవేటర్లు (4),<br>❀ స్ప్రేయర్లు (16),<br>❀ హార్వెస్టర్లు (6),<br>❀ నూర్పిడి పరికరాలు (9),<br>❀ చేతి పనిముట్లు (8),<br>❀ మాన్యువల్ వీడర్లు (5),<br>❀ వ్యవసాయ పనిముట్లు, | ❀ నీరు తోడే మినీ పంపులు (4),<br>❀ ట్రాక్టర్ లిఫ్టర్లు & లెవెలర్లు (3),<br>❀ మినీ ట్రాక్టర్లు (5),<br>❀ మినీ రైస్ మిల్లు (2),<br>❀ ఫుడ్ ప్రాసెసింగ్ యంత్రాలు (10),<br>❀ ఇటుకల తయారీ యంత్రాలు (2),<br>❀ గ్రామీణ రవాణా యంత్రాలు (8),<br>❀ కొబ్బరి మరియు ఇతర చెట్లు ఎక్కే పరికరాలు (3), | ❀ కరెంటు స్తంభాలను ఎక్కే పరికరాలు (3),<br>❀ వృద్ధులు, పేషెంట్ల కొరకు సకల సౌకర్యాల మంచము (3),<br>❀ ఎలక్ట్రిక్ & ఎలక్ట్రానిక్ పరికరాలు (12),<br>❀ ఇంటి అవసరాల కోసం హెర్బల్ ద్రావకాలు,<br>❀ ఆవు పేడతో వస్తువులు చేసే పరికరాలు (14). |

**పై ఇన్నోవేషన్లు కావలసిన వారు సంప్రదించ గలరు :**

**సుభాష్ చందర్,** సి.ఇ.ఓ., **"క్రియేటివ్ మైండ్స్"**

ఫ్లాట్ నెం. 77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500 094.

ఫోన్ : 040–27111959, మొబైల్ : 9652801700.

# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి



- జమ్మలమడక శశిమోహన్

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 73 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై-ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

– ఎడిటర్.

## చిన్న, సన్నకారు రైతులకు ఆపద్బాంధవులు కావటంతో పాటు
## పవర్ వీడర్‌లతో గ్రామీణ యువతకు ఉపాధి

మన భారతదేశ వ్యవసాయ రంగంలో 85 శాతం చిన్న, సన్నకారు రైతులే అని ప్రభుత్వాలే ప్రకటిస్తున్నాయి. ఏ గ్రామంలోనైనా సరే పెద్ద పెద్ద కమతాలు వున్న రైతులు 10 మంది ఉంటే కొన్ని గుంటలు (సెంట్ల) నుండి 5 ఎకరాల లోపు రైతులు 90 మంది ఉంటారు అన్న విషయం ప్రతి గ్రామీణ యువకుడికీ తెలుసు. పెద్ద రైతులు ట్రాక్టర్లతో వ్యవసాయం చేసుకుని తమ అవసరాలు తీర్చుకుంటూ ఉంటారు. గ్రామాల్లో కొందరు యువకులు ట్రాక్టర్లను కొనుగోలు చేసుకొని మిగతా రైతులకు కిరాయికి పనులు చేస్తూ ఉంటారు. మరి అతి చిన్న రైతులు... అంటే కొన్ని గుంటల పొలం నుండి ఎకరా, అర ఎకరం పొలం వున్న వారి పరిస్థితి చాలా దయనీయం. వీరి పొలాలకు ట్రాక్టర్లు కిరాయికి రావు, ఊర్లో ఎద్దులతో తమ వ్యవసాయం చేసుకుంటూ, కిరాయికి కూడా పని చేసే ఎద్దుల యజమానులు కూడా వీరి పొలాలకు రారు.

పంటలు వేసిన తర్వాత ఏ పంటకైనా అంతర సేద్యం తప్పనిసరి. లేకుంటే కలుపు పెరిగి పోతుంది, పంట కూడా సరిగా ఎదుగుదల ఉండదు. ఈ అంతర సేద్యాలు చేయాలంటే ట్రాక్టర్లతో చాలా పంటలలో కుదరదు. కేవలం ఎద్దులతోనే అంతర సేద్యాలు చేసుకోవాలి. ఉన్న కొద్దిపాటి ఎద్దుల జతలు ఊర్లోని అందరు రైతుల పంటలలో అంతర సేద్యం చేయటం కుదరదు.

మరి వీరి పరిస్థితి ఎలా? వీరి సేద్యం కూడా జరగాలి కదా! అందుకోసమే 'పల్లెసృజన' సృజన ఈ సమస్యల నుండి బయట పడాలని



అశోక్ వీడర్ మరియు పరికరాలు







రైతులు తయారు చేసిన చిన్న వీడర్లను తయారు చేసిన వారిని వెలుగు లోకి తెచ్చి వారి చేతనే రైతులు అందరికీ అందుబాటులోకి వచ్చేలా వారి గ్రామాల్లోనే తయారు చేయించేందుకు కృషి చేసింది.

ఈ వీడర్లను ముందుగా ఇన్నోవేటర్లు తయారు చేసింది కేవలం అంతర సేద్యాలు, కలుపు నివారణకు అనుకున్నారు. కానీ, దాన్ని వినియోగించిన మరి కొందరు సృజనాత్మక రైతులు వాటితో ఎన్నెన్నో రకాల పనులు చేసుకుని అద్భుతంగా తమ సమస్యలను పరిష్కరించు కుంటున్నారు. మచ్చుకు కొన్ని రకాల పనులను ఈ వీడర్లతో చేసే వాటిని గురించి తెలుసుకుందాం... 1. పంటలలో అంతర సేద్యం, 2. పురుగు మందు పిచికారి, 3. విత్తనాలు వేయడం, 4. ఎరువులు వేయటం, 5. పంటలను నీరు అందించేందుకు పంపుసెట్‌గా వినియోగించటం, 6. దానికే ట్రాలీని ఏర్పాటు చేసుకుని ఎద్దుల బండిలా పని చేయించటం, 7. భూమి చదును చేయటం, 8. బోదెలు చేయటం, 9. మార్కెట్‌కు కూరగాయలు రవాణా, పొలాలకు కూలీల రవాణా చేయటం, 10. భూమి దున్నుకోవటం.... ఇంకా ఎన్నెన్నో రకాల వ్యవసాయ పనులు సృజనాత్మకంగా చేసుకుంటున్నారు. కాబట్టి గ్రామాల్లోని యువకులు ఇలాంటి వీడర్లను తీసుకుని, వాటికి ఆయా గ్రామాల్లో అవసరమైన అదనపు పనిముట్లను ఏర్పాటు చేసుకుని, చిన్న, సన్నకారు రైతులు ఎదుర్కొంటున్నా పైన తెలిపిన సమస్యలను పరిష్కరించుకోవటం ద్వారా వారికి మీరు ఆపద్బాంధవులు కావచ్చు, అలాగే స్వచ్ఛమైన ఆదాయం పొందటం ద్వారా మీరు ఉపాధి పొందవచ్చు.

'పల్లెసృజన' ఇన్నోవేటర్లు ఎంతో మంది తమకు తోచిన విధంగా అంతర సేద్యాలు చేసే వీడర్లను తయారు చేశారు. వాటిలో కొన్నింటిని మీకు ఇక్కడ పరిచయం చేస్తున్నాము....

**అశోక్ వీడర్:** అశోక్ దాదాపు వ్యవసాయానికి అవసరమైన అన్ని రకాల పరికరాలతో తన వీడర్‌ను అందిస్తున్నాడు. ఈ వీడర్‌తో అంతర సేద్యానికి అవసరమైన గొర్రు, రెండు రకాల గుంటక పలుగులు, మట్టిని మెత్తగా చేసేందుకు రొటోవేటర్, విత్తనాలు వేయటానికి, ఎరువులు వేయటానికి అవసరమైన జడిగము, బోదెలు చేసుకోవటానికి అవసరమైన పరికరం, పురుగు మందులు పిచికారి చేయటానికి స్ప్రేయర్, పొలానికి ఇంటికి అవసరమైన సరుకుల రవాణా కొరకు 6–8 క్వింటాళ్ళ బరువు మోయగల ట్రాలీతో పాటు అవసరమైతే పొలానికి నీరు తోడటానికి అవసరమైన పంపును అమర్చి ఇస్తాడు. దీనికి రెండు ఇనుప చక్రాలతో పాటు, రెండు టైర్లు కూడా ఇస్తాడు. వీటిని అమర్చడం వీడదీయటం చాలా సులువు. పొలానికి వెళ్ళేటపుడు, వచ్చేటపుడు టైర్లు ట్రాలీ అమర్చుకొని హాయిగా కూర్చొని నడుపుకుంటూ వెళ్ళవచ్చు. పొలానికి వెళ్ళిన తర్వాత ఇనుప చక్రాలు తగిలించుకుని సేద్యం పనులు చేసుకోవచ్చు. అదనపు ఖర్చు చేయగలిగితే వరి మాగాణిలో కూడా కలుపు తీయటానికి అనువైన చక్రాలను సమకూర్చబడతాయి. చూడముచ్చట అయిన ఈ వీడర్‌తో గ్రామంలో మీరు ఏ రైతుకు ఏ అవసరం వచ్చినా సరే మీరు దీనితో తీర్చవచ్చు.


వెంకటేశ్వరాచారి వీడర్

**మహిపాల్ వీడర్ :** మన 'పల్లెసృజన' ఇన్నోవేటర్లలో మొట్టమొదట వీడర్‌ను తయారు చేసిన వాడు మహిపాల్ చారి. ఇతని వీడర్లు ఇప్పటికే వేలాది మంది రైతులు వినియోగిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, ఇతర రాష్ట్రాలకు కూడా దీన్ని ఎగుమతి చేయటం జరిగింది. దీనితో పాటు 5 కొయ్యల గొర్రు, రెండు గుంటక పలుగులు ఇస్తారు. కఠినమైన సేద్యాలను కూడా అవలీలగా చేయగల శక్తివంతమైన వీడర్ మహిపాల్ వీడర్.

**వెంకటేశ్వరాచారి వీడర్:** ఏక చక్రం కలిగిన ఈ వీడర్ తక్కువ వెడల్పు వున్న జొన్న, వేరుశనగ లాంటి పంటలలో అంతర సేద్యాలతో పాటు, ఎక్కువ వెడల్పు వున్న ప్రత్తి, మిరప, కంది లాంటి పంటలలో కూడా అంతర సేద్యాలు చేసుకోవచ్చు. దీనితో పాటు ఎరువులు, విత్తనం వేసుకోవటానికి కూడా ఏర్పాటు చేయబడి వుంటుంది. దీనితో కూడా పురుగు మందులు పిచికారి చేసుకోవచ్చు. 5 హార్స్ పవర్‌ల డీజిల్ ఇంజన్‌తో ఇది పనిచేస్తుంది.

**వెంకటయ్య వీడర్ :** ఈ వీడర్ కూడా ఒకటే చక్రం కలిగి వుంటుంది. పెట్రోల్ ఇంజన్ కావటం వల్ల చాలా తక్కువ బరువు కలిగి వుంటుంది, కొన్న, వేరుశనగ లాంటి పంటలలో సునాయాసంగా మహిళలు కూడా ఎటువంటి అలుపు లేకుండా అంతర సేద్యాలు చేసుకోవచ్చు. 10 అంగుళాల వెడల్పు గల జొన్న, వేరుశనగ లాంటి పంటలలో 3 నుండి 6 సాళ్ళ వరకు ఒకేసారి కలుపు నివారకు అంతర సేద్యాలు చేసుకోవచ్చు. ప్రత్తి, మిరప లాంటి పంటలలో కూడా అంతర సేద్యాలకు అనువుగా గొర్రు, గుంటక పలుగులను మార్చుకుని చేసుకోవచ్చు.

**అంజయ్య వీడర్ :** ఈ వీడర్‌ను గురించి ప్రత్యేకంగా వ్యాసం ఈ సంచికలోనే ప్రచురించాము, గమనించ గలరు. ●

**ఈ వీడర్ల కొరకు సంప్రదించండి:సుభాష్ చందర్, ఫోన్ : 9652 801700**

# నవంబర్ - డిశంబర్ 2021 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు






తెలంగాణ రాష్ట్రం లోని వరంగల్‌కు చెందిన 'వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ' వారు 2020వ సంవత్సరానికి ఇచ్చిన 'భారత్ శాంతి దూత్ పురస్కారం-2020' కి గాను 'పల్లెసృజన' వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారికి ప్రదానం చేస్తున్న దృశ్యాలు - పురస్కారం పత్రం.



2021వ సంవత్సరం ఉత్తమ వ్యవసాయ పరికరాల ఇన్నోవేటర్‌గా కొప్పుల అశోక్ 'రైతునేస్తం' పురస్కారాన్ని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అందుకుంటున్న చిత్రం





తిరుపతి మహతి ఆడిటోరియంలో అక్టోబర్ 30,31 తేదీలలో జరిగిన 'గో మహా సమ్మేళనం' లో పాల్గొన్న 'పల్లెసృజన' బృందం. తి.తి.దే. ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ శ్రీ వై.వి. సుబ్బారెడ్డి గారు, చిత్తూరు జిల్లా కలెక్టర్ మరియు ఇతర ప్రముఖులు 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన ఇన్నోవేషన్లను పరిశీలించారు.



డిసెంబర్ 23 'రైతు దినోత్సవం' సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, 'లయన్స్ క్లబ్' వారు సృజనాత్మక రైతు 'ముళ్ళపూడి సత్యనారాయణ' కి పురస్కారం అందజేస్తున్న దృశ్యం.









గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మహిళలు వ్యాపారం ఎలా చెయ్యాలో అవగాహన శిక్షణలో భాగంగా అక్టోబర్ 19న 'పల్లెసృజన' కార్యాలయానికి ఎ.ఎల్.సి. ఇండియా నుండి 2 బ్యాచ్‌లుగా శ్రీకాకుళం, మహారాష్ట్ర ప్రా,తాల నుండి 90 మంది మహిళలు పాల్గొన్నారు.



డిసెంబర్ 23 'రైతు దినోత్సవం' సందర్భంగా అనంతపురం జిల్లా, ఉరవకొండకు చెందిన 'జైకిసాన్ ఫౌండేషన్' వ్యవస్థాపకులు శ్రీ ఓబులేషు గారి ఆధ్వర్యంలో 2021వ సంవత్సరానికి గాను వ్యవసాయ ఇన్నోవేషన్లను రైతాంగానికి అందిస్తున్న 'పల్లెసృజన'ను ఉత్తమ ద్వైమాసిక పత్రికగా ఎన్నిక చేసి, పత్రిక ఎడిటోరియర్ బోర్డు సభ్యుడు వీరరాఘువ రెడ్డి కి పురస్కారం అందజేస్తున్న దృశ్యం.








గుంటూరు లోని 'లాం ఫామ్'లో 17-19 డిసెంబర్, 21న నిర్వహించిన 'అగ్రిటెక్ -2021'నూతన వ్యవసాయ సాంకేతికతలపై సదస్సు మరియు ప్రదర్శన లో 'నాబార్డ్ - ఆంధ్రప్రదేశ్' వారి సహకారంతో 'పల్లెసృజన' ఇన్నోవేషన్ల ప్రదర్శన ఏర్పాటు చేసి సందర్భంలో అధికారులు, రైతులు ఇన్నోవేషన్లను ఉత్సాహంగా తిలకించారు. ముగింపు సభలో 'సుభాష్ చందర్' ఉపన్యసించారు.



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## వేరుశనగ త్రవ్వి తీసే యంత్రం

**సమస్య – పరిష్కారం :**

వాణిజ్య పంటలలో వేరుశనగది ప్రముఖ స్థానమనే చెప్పుకోవచ్చు. దీన్ని ప్రధాన పంటగాను, కందితో మిశ్రమ పంటగాను రైతులు సాగు చేస్తున్న విషయం అందరికీ విదితమే. ఈ పంట సాగుకు పడే కష్టానికి దాదాపు రెట్టింపు కష్టం పంట కోతకు పడుతుంది. దీనికి ప్రధాన కారణం కూలీలు లభించక పోవడం, ఒకవేళ లభించినా అధిక మొత్తంలో చెల్లింపులు. పర్యవసానంగా ఈ పంట సాగులో పెట్టిన ఖర్చులకి తగ్గ ఫలితం రావటం లేదు. దీనికి పరిష్కారంగా వేరుశనగ కాయలను భూమినుండి తీసి వేరు చేయటానికి గుజరాత్‌కు చెందిన "సంజయ్ కుమార్ డి. తిల్వా" అనే రైతు ఒక పరికరం తయారు చేశాడు.

**పరికరం :**

ట్రాక్టర్‌తో అనుసంధానం చేసుకుని పని చేసే ఈ పరికరం 540 లేదా 1000 ఆర్‌పిఎం వేగానికి అనువుగా తయారు చేయబడింది. ఈ పరికరం వేరుశనగ చెట్లను భూమి నుండి త్రవ్వి తీస్తుంది. తీసిన మొక్కలు ఒక కన్వేయర్ బెల్టు ద్వారా వెళ్తూ ఆ కన్వేయర్ బెల్టులోని కుదుపులకు చెట్టు నుండి వేరుశనగ కాయలు వేరౌతాయి. ఇలా కుదుల కారణంగా కాయలను అంటుకుని వున్న మట్టి కూడా వేరు చేయబడి వేరుశనగ కాయలు నాణ్యతగా ఉండటం వల్ల మార్కెట్లో మంచి ధర కూడా లభించే అవకాశముంటుంది.

**సాంకేతిక వివరాలు :**

❀ ఈ యంత్రం ఉపయోగించటానికి గంటకు ఒక లీటరు డీజిల్







ఖర్చవుతుంది.

❀ 35 హార్స్‌పవర్‌ల శక్తిగల ట్రాక్టర్‌తో దీన్ని అనుసంధానం చేసుకోవచ్చు.

❀ ఈ పరికరం 510 కిలోల బరువుంటుంది.

❀ పంట నూర్పిడి 98 శాతం జరుగుతుంది.

❀ పరికరం 1250 మి.మీ. వెడల్పు ఉంటుంది.

❀ 100–120 మిమీ. (దాదాపు 5 అంగుళాలు) లోతుకు త్రవ్వి వేరుశనగను పీకుతుంది.

**ముఖ్యాంశాలు :**

❀ ఇటువంటి ఇతర పరికరాలతో పోలిస్తే ఇది వేరుశనగ పంటను త్రవ్వి తీయటమే కాకుండా కాయలను శుభ్రం చేసి పెడుతుంది.

❀ ఇతర పరికరాలకన్నా కాయలు దెబ్బ తినకుండా చాలా సమర్థవంతంగా పని చేస్తుంది.

❀ ఈ సాధనంతో గంటకు ఒకటిన్నర ఎకరాల్లో వేరుశనగను పీకి కాయలు వేరు చేస్తుంది.

❀ ఇది అన్ని రకాల భూముల్లో పని చేస్తుంది.

**పురస్కారాలు :**

❀ ఇన్నోవేటర్ సంజయ్ కుమార్‌కు ఎన్.ఐ.ఎఫ్. వారు 7వ జాతీయ ఇన్నోవేషన్ పోటీలలో బహుమానమే కాక, 2013లో ఉత్తమ సాంకేతిక జ్ఞాన పురస్కారం కూడా లభించింది.

❀ 2004 లోనే పేటెంటుకు నమోదు చేయటం జరిగింది.

## పసుపు నూర్పిడి యంత్రం

**సమస్య – పరిష్కారం :**

పసుపు లేదా ఏవైనా దుంపలు సాగు చేసేవారు పంట పక్వానికి వచ్చినప్పుడు సరియైన సమయంలో సరియైన పద్ధతిలో వాటిని త్రవ్వి తీయగలిగితే వృధాను అరికట్టవచ్చు. ఎక్కువ పనివాళ్ళపై ఆధారపడే ఈ ప్రక్రియలో డబ్బు పెట్టడానికి కొందరు రైతులు సిద్ధంగా వున్నా, మనుషులు లభించడం కష్టంగా మారుతోంది. రైతుకు దిగుబడి ఖర్చును పెంచటంలో ఇది ప్రధాన పాత్ర పోషించి, పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్య పరిష్కారానికి గాను తమిళనాడు రాష్ట్రానికి చెందిన రైతు పి. రామరాజు ఒక మినీ పవర్ టిల్లర్‌కు అనుసంధానంగా 'పసుపు దుంపలను భూమినుండి త్రవ్వి తీసే' పరికరాన్ని రూపొందించాడు. దీని సహాయంతో ఆలుగడ్డ, కంద, క్యారెట్ లాంటి దుంపలు, ప్రత్యేకించి పసుపు, అల్లం పంటల నూర్పిడి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. అంతేకాదు దుంపల నాణ్యతకు ఎలాంటి భంగం కలుగకుండా తక్కువ ఖర్చులో రైతుకు లాభం చేకూర్చేలా పనిచేస్తుంది.

**పరికరం :**

ఈ పరికరాన్ని ఒక బెల్ట్ ద్వారా పవర్ టిల్లర్‌కు అనుసంధానం చేయాల్సి వుంటుంది. టిల్లర్ నడిచేటపుడు ఈ పరికరం భూమిలోకి చొచ్చుకొనిపోయి, దుంపలను పైకి తీసి మట్టిని జల్లించి, దుంపలకు ఎలాంటి దెబ్బ తగలకుండా కత్తిరించి వేరు చేస్తుంది. వాటిని సేకరించడం కూడా ఎంతో సులువు. తక్కువ కూలీలతో ఎక్కువ దుంపలను సేకరించుకోవచ్చు. ప్రస్తుతం ఈ పరికరం ఎంతోమంది రైతుల మన్ననలు పొందటంతో పాటు, ఎంతో మంది కూలీల ఖర్చును కూడా ఆదా చేస్తోంది.

**సాంకేతిక వివరాలు :**

❀ దీన్ని 10–12 హార్స్‌పవర్ శక్తిగల టిల్లర్‌కు అనుసంధానం చేయాల్సి వుంటుంది.

❀ భూమిలోపలికి చొచ్చుకుపోవటానికి 3 బ్లేడ్లు కలిగి వుంటుంది. బ్లేడ్లు ఎంత లోతువరకు వెళ్ళాలో నియంత్రించుకునే సదుపాయం





కలదు.

- భూమిలోపలికి వెళ్ళే 3 బ్లేడ్లు 10 అంగుళాల వెడల్పులో వుంటాయి.
- భూమి రకాన్ని అనుసరించి అవసరమైనంత లోతులో త్రవ్వి, జల్లిపట్టే సామర్థ్యాన్ని కూడా నియంత్రించు కోవచ్చు.
- ఒక గంటలో పావు ఎకరంలో దుంపలను త్రవ్వి తీయవచ్చు.
- టిల్లర్‌కు ఉపయోగించే ఇంధనం తప్ప ఈ పరికరాన్ని ఎటువంటి ఇంధనం అవసరం లేదు.

**ముఖ్యాంశాలు :**

- సులభంగా ఎక్కువ నూర్పిడి చేసుకోచ్చు.
- టిల్లర్‌ను నడిపే ఒక్క వ్యక్తి మాత్రమే అవసరం. నూర్పిడి అయిన దుంపలను సేకరించడానికి కూలీలు అవసరం.

**పురస్కారాలు :**

- ఎన్.ఐ.ఎఫ్. వారు 2013లో నిర్వహించిన 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో ఇన్నోవేటర్ రామరాజుకు ప్రోత్సాహక బహుమతి లభించింది.

ఇన్నోవేటర్ : **పి. రామరాజు, తమిళనాడు.**

**వివరాలకు సంప్రదించండి:**

**సుభాష్ చందర్, ఫోన్: 9652801700**

# పరిష్కారం కోరుతున్న గొర్రెల కాపరి సమస్య !



ఈ సమస్యను అందించిన వారు కర్నూలు జిల్లా, కల్లూరు మండలం, బొల్లవరం గ్రామానికి చెందిన 'గొర్ల కాపరి' "అరిగిలి డవులేశు. వారి సమస్యను పల్లెసృజనతో వివరిస్తూ, "తాను పుట్టినప్పటి నుంచి చేస్తున్న పని నేటికీ చేస్తునే వున్నాము. గొర్రెల మందను పగలంతా అడవులలో తిప్పి అవి ఆహారాన్ని తీసుకునేలా ఎక్కడ గడ్డి, తినే ఆహారం లభిస్తుందో అక్కడికి తీసుకు వెళ్తూ వుంటాము. రాత్రి అయితే ఏ రైతు గొర్రెల మందను తమ పొలంలో ఆపమని కోరుకుంటాడో ఆ పొలంలో ఆపుతాము. పూర్వం పంటలు ఇప్పటిలా ఉండేవి కాదు. ఎక్కువ భాగం వర్షాధార పంటలే కాబట్టి జనవరి – ఫిబ్రవరి నెలలు వచ్చేసరికి పంటలు పూర్తయ్యేవి, రైతులు కూడా తమ పొలాల్లో గొర్రెల మందను ఆపటానికి అప్పుడే కోరుకునే వారు. వర్షాకాలం వచ్చిందంటే పొలాల్లో ఆపటానికి కుదరదు కాబట్టి అడవులు, కొండలపైనే వాటి రాత్రి బస ఏర్పాటు చేసుకుని 'తెల్లవార్లూ వాటి చుట్టూ తిరుగుతూ మాతో పాటు మా కుక్కలూ కాపలా కాసే వాళ్ళం. ఎందుకంటే ఏమాత్ర అజాగ్రత్తగా వున్నా, తోడేళ్ళు వచ్చి గొర్రెలను లాక్కెళ్ళి తినేసేవి.

కానీ ఇప్పుడు కాలం మారిపోయింది. ఏ మాసమైనా సరే రైతులు తమ పొలాల్లో గొర్రెల మంద ఆపమని కోరుకుంటున్నారు. గొర్రెల మంద ఆపుకునే రైతు పొలం ఖాళీగానే వుంటుంది కానీ, చుట్టు ప్రక్కల పొలం పంటతో వుంటోంది. ఏమాత్రం ఒక్క గొర్రె పక్క పొలంలో పంటపై పడి మేయటానికి వెళ్ళినా సరే మిగతా గొర్రెలన్నీ దాన్ని అనునయిస్తాయి. అప్పుడు పక్క పొలం రైతు అడిగే పరిహారం ఇవ్వగలిగే తాహతు మాకుండదు.

"అందుకే గొర్రెమంద చుట్టూ వలను పాతుకుంటున్నాము. ప్రస్తుతం తోడేళ్ళ నుంచి కాపడటానికి కుక్కలు ఉన్నాయి చాలని నిద్రపోయే అవకాశం మాకు లేకుండా పోయింది. ఎందుకంటే తోడేళ్ళను మించిన 'దొంగల' వల్ల ఇప్పుడు భయం. కాబట్టి ఇప్పుడూ పూర్వం లాగానే తెల్లవార్లూ కావిలి కాస్తూనే ఉన్నాము. ఈ సమస్యకు మా తాహతుకు తగిన పరిష్కారం కనుగొంటే మా జాతి యావత్తు మీకు పాదాభివందనం చేస్తుంది" అన్న గొర్లకాపరి అరిగిలి డవులేశు సమస్యకు పరిష్కారం కనుగొనాలని 'పల్లెసృజన' ఇన్నోవేటర్లకు, సృజనాత్మక పాఠకులకు విజ్ఞప్తి.

'గొర్రెల కాపరి' రైతులు ఎదుర్కొంటున్న ఈ సమస్యకు పరిష్కారాన్ని 'పల్లెసృజన'తో పంచుకో గలరు. తద్వారా వారికి శారీరక శ్రమతో పాటు ఖర్చును కూడా తగ్గించ గలిగే పొదుపైన "ఇన్నోవేషన్" రూపొందేలా చేయగలగాలరని 'పల్లెసృజన' భావిస్తోంది.

మీ ఇన్నోవేషన్ ఐడియా లేదా ప్రొటోటైప్ (నమూనా పరికరం) ఈ క్రింది నంబర్లకు వాట్స్ యాప్ ద్వారా పంచుకో గలరు.

వాట్స్ యాప్ నంబర్లు : **బ్రిగేడియర్ గణేశం, 9866001678, వీరరాఘవ రెడ్డి, 81257 99904**

# రైతులు - వ్యవసాయం నాడు - నేడు




1. పూర్వం రైతులు ఒక ఎకరం పొలంలో 25 నుండి 30 క్వింటాళ్ళ ధాన్యం ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా పండించేవారు.
2. ప్రస్తుత ఆధునిక రైతులు ఎక్కువ దిగుబడి రావటం కోసం అనేక రకాల రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయో గిస్తున్నారు. అలాగే అధునాతనమైన యంత్ర పరికరాలను ఉపయోగించి దాదాపు ఎకరం పొలంలో 40 నుండి 50 క్వింటాళ్ళ ధాన్యాన్ని పండిస్తూ ఉన్నారు. ఇలా ఆహార ధాన్యాలు, కూరగాయలు, పప్పు దినుసుల పంటలు ఎవైనా కావచ్చు, ఇక్కడ ఖర్చు ఎక్కువ చేసి, ఎక్కువ దిగుబడి సాధిస్తున్నారు తప్ప సగటున రాబడి మాత్రం పూర్వం ఉన్నంతే ఉంటుంది.
3. దాదాపు 30 నుండి 40 శాతం వరకు ఎక్కువ దిగుబడి రావటం వలన రైతులకు ఎలాంటి లాభం లేదు. ఇక్కడ రసాయన ఎరువులు, యంత్ర సామాగ్రి, రవాణా ఖర్చులు, కూలీలు మొదలైన ఎన్నో రకాలైన అదనపు పెట్టుబడులు పెట్టుకుంటున్నారు.
4. ముఖ్యంగా రైతులు పండించిన పంటలకు వాతావరణం అనుకూలించి, అతివృష్టి, అనావృష్టి నుండి అలాగే పంటలకు మంచి గిట్టుబాటు ధర వస్తే రైతులు సంతోషంగా ఉంటారు. ఇక్కడ ఏది అనుకూ లించకున్నా రైతులకు నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయి.
5. మన దేశంలో ప్రజల అవసరానికి మించి రైతులు ఆహార పంటలు ఎక్కువగా రసాయనిక ఎరువులు వినియోగించి పండిస్తున్నారు.
6. మన ప్రభుత్వాలు పంటలను మార్పిడి చేసి రైతులను పండించమని కోరుతు న్నారు కానీ, వరి ఉన్నచోట గోధుమ, గోధుమ ఉన్నచోట వాణిజ్య పంటలు (కూరగాయలు, పప్పులు) పండించమని కోరుతున్నారు. కానీ ఎక్కువ రసాయన ఎరువులను వినియోగించడం వలన పంటల ఉత్పత్తి ఎక్కడైనా పెరిగి డిమాండ్ తగ్గిపోతుంది.
7. మన భారతదేశ ప్రజల అవసరాలకు మించి పంటలు పండించడం వలన గిట్టుబటు ధర లేక డిమాండ్ తగ్గి రైతులు నష్టపోతున్నారు.
8. అందుకే విజ్ఞులైన రైతు సోదరులు, ప్రజలు, ప్రభుత్వాలు ఆలోచించి పంటలు ఎక్కువ దిగుబడి రావడానికి వినియోగించే రసాయన ఎరువుల వాడకం నిలిపివేసి, నాణ్యమైన పంటలు పండించ గలిగితే మంచి గిట్టుబాటు ధర వస్తుంది.

   అవసరం ఉన్నంత వరకే అన్ని ఆహార పంటలు పండించడం వలన పంటలకు మంచి గిరాకీ ఉండటం వలన రైతు సోదరులు సంతోషంగా ఉండగలరు.
9. ముఖ్యంగా మన దేశ ప్రజలు ఈ రసాయనిక ఎరువులు లేని ఆహార పదార్థాలు తీసుకోవడం వలన ఆరోగ్య విధానంలో మార్పు వస్తుంది.






## ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలి అన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 400/–లతో 2సంవత్సరాల పాటు తమ గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటం, సంతృప్తి కలగటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది. ఈ ప్రయత్నం వల్ల తెలుగు రాష్ట్రాలలోని 30 వేల గ్రామాలకు త్వరలో 'పల్లెసృజన' చేరుతుందని, సామాన్య ప్రజల మధ్య సమానాంతర సంభాషణలు ప్రారంభమై, వారిని మరింత ప్రభావితం చేస్తాయని 'పల్లెసృజన' మనసారా ఆశిస్తోంది. -ఎడిటర్

**పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి - 'పల్లెసృజన'ను బహూకరిచండి!** **మీ గ్రామానికి మీరిచ్చే అత్యుత్తమ బహుమతి 'పల్లెసృజన'**



సందర్భం ఏదైనా ఆచారం, సాంప్రదాయం ప్రకారం ప్రతి సందర్భంలో ఓ బహుమతి ఇస్తూ వుంటారు. దానికెంత ఖర్చు చేయాలి? అసలు బహుమతి ఏమివ్వాలి? అన్నవి ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటారు.

❀ ఇచ్చిన బహుమతి ఆ సందర్భంలోనే ఆనందాన్ని పంచేదిగా కాకుండా

❀ అందరూ ఇచ్చిన దానికన్నా భిన్నంగా.... ❀ జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పంచేది, పెంచేదిగా ఉండాలంటే.....?

బహుమతి ఇచ్చిన వారికే కాక, తీసుకున్న వారితో పాటు, నలుగురికీ పనికి వచ్చే విధంగా ఉండాలి. 'పల్లెసృజన' పత్రిక మన పల్లెల్లో మారుమూల ప్రాంతాల్లో దాగివున్న విజ్ఞాన సంపదను వెలికి తీసి, ప్రస్తుత నవ సమాజానికి ఉపయోగపడే విధంగా చేయటానికి పాటు పడుతుంది.

**'పల్లెసృజన' చందా వివరాలు ఈ పత్రిక చివరి పేజీలో ఉంటాయి**

# ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం

'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో

લોકસરવાણી
Loksarvani
(Gujarati version of Honey Bee)
SRISTI, P O Box No. 15050
Ambawadi, Ahmedabad - 380015, Gujarat
loksarvani@sristi.org

21101

**పశువుల్లో నులిపురుగుల నివారణకు:**

పశువుల పోషణలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి ప్రేవుల్లో నులి పురుగులు ఏర్పడి అవి తిన్నది అరగక బాధపడుతూ వుంటాయి. అశ్రద్ధ వహిస్తే పశువు క్రమంగా క్షీణించి మరణించే ప్రమాదముంది. పశువులలో నులి పురుగుల నివారణకు బజార్లో చాలా మందులు దొరుకుతున్నాయి. కానీ గుజరాత్ రాష్ట్రం, బరూచ్ జిల్లా, కంబూడి గ్రామానికి చెందిన 'పుల్జీభాయ్ ఉమార్ భాయ్ వాస్వా' మన పెరట్లో దొరికే చెట్లతోనే వీటికి ఉత్తమమైన చికిత్స అందించవచ్చు అంటున్నారు. ఈయన పద్ధతి ప్రకారం 100 గ్రా. వేపాకులు, 100 గ్రా. దానిమ్మ ఆకులను మెత్తగా నూరి, 400 మి.లీ. నీటిలో కలపాలి. ఒక గంట తర్వాత ఆ మిశ్రమాన్ని బాగా కలిపి రోజుకు ఒకసారి చొప్పున రెండు మూడు రోజులు పశువుకు తాగిస్తే నులిపురుగుల నుండి నివారణ పొంద వచ్చు అంటున్నాడు.



21102

**పంటలలో రసం పీల్చే పురుగుల నివారణకు:**

ఈ రసం పీల్చే పురుగు ఏ పంటకైనా, మొక్కకైనా సోకి చెట్టు ఆకులలోని రసాన్ని పీల్చేసి మొక్కలను నిర్వీర్యం చేసి అవి నశించిపోయేలా చేస్తాయి. వీటి నివారణకు గుజరాత్‌కు చెందిన 'పరుషోత్తమ్ భాయ్' చక్కటి, తేలికైన ఉపాయం చెపుతున్నాడు. ఈయన చాలాకాలంగా తన



పొలంలో ఇదే పద్ధతిని వాడుతు న్నాడట. ఈయన వేపాకులు, మజ్జిగ తేటను ఉపయోగించి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. వేపాకులను నీటిలో వేసి ఆ నీరు మూడవ వంతుకు వచ్చే వరకు మరగబెట్టి, 200 మి.లీ. ఆ కషాయాన్ని తీసుకుని, 1500 మి.లీ. మజ్జిగ తేటలో కలిపి పొలాలపై పిచికారి చేస్తే ఈ రసం పీల్చే పురుగు నుండి నివారణ పొందవచ్చు అని చెపుతున్నాడు.

21103

**వెల్లుల్లి పంటను చీడనుంచి కాపాడటానికి:**

గుజరాత్ రాష్ట్రానికి చెందిన 'పరుషోత్తమ్ భాయ్' ఈ ఉపాయం కూడా చెబుతున్నారు. భారత సుగంధ ద్రవ్యాల బోర్డు లెక్కల ప్రకారం 2002-2007 మధ్యలో గుజరాత్ రాష్ట్రంలో వెల్లుల్లి ఉత్పత్తి 480 శాతం పెరిగింది. ప్రత్యేకించి జునాగఢ్ జిల్లాలో అత్యంకంగా వెల్లుల్లి పండిస్తుంటారు. ఆ జిల్లాలోని రైతులు వెల్లుల్లి పంటను కాపాడటానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్నిచ్చే సేంద్రియ పద్ధతిని పాటిస్తున్నారు. దాన్ని పరుషోత్తమ్ భాయ్ మనకు తెలియజేస్తున్నారు. మజ్జిగ, గోమూత్రము, కుళ్ళిపోయిన సజ్జలపిండి ఈ మూడింటిని బాగా కలిపి వెల్లుల్లి పంటపై పిచికారి చేసి పంటను చీడల నుండి రక్షించుకోవచ్చు అని చెపుతున్నారు.

ఇంకొక రైతు 'రమేష్ భాయ్' మరో పద్ధతి వాడి తన వెల్లుల్లి పంటను చీడనుండి కాపాడుకుంటున్నాడు. ఆయన ఆముదము, నీరు, బట్టలుతికే సోడను కలిపి ఈ ద్రావ కాన్ని తయారు చేసుకుంటాడు. ఒకటిన్నర లీటర్ల ఆముదము, 100 గ్రా. బట్టలుతికే సోడ, 20 లీటర్ల నీటిలో కలిపి పంట కు నీరు పెట్టిన తర్వాత రెండు మూడు సార్లు పంటపై పిచికారి చేస్తే మంచి ఫలి తం వుంటుందని చెపుతున్నారు.



'పల్లెసృజన'లో వికసించిన ముచ్చటైన మూడో "పద్మం"

# 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్న చింతల వెంకట్ రెడ్డి

2018లో 'పల్లెసృజన'కు పరిచయమైన 'మట్టి మనిషి' చింతల వెంకట్ రెడ్డి గారు "సివిఆర్" పేరుతో ఉభయ తెలుగు రాష్ట్రాల రైతాంగంలో మంచి పేరు సంపాదించుకున్న సృజనాత్మక రైతు. వీరు స్వయంగా తన పొలంలో ప్రయోగాలు చేసి, 'మట్టిలో అద్భుతమైన శక్తులు' దాగున్నాయని గుర్తించి, మట్టిని ఉపయోగిస్తే చాలు ఏ పంటలకైనా పురుగు మందులు, ఎరువులు కూడా అవసరం లేకుండా ఆరోగ్యకరమైన పంటలు అధిక దిగుబడిలో పండుతాయని లోకానికి చాటి చెప్పాడు. తాను కనుగొన్న విషయాన్ని ఏ దేశమూ తమ ఇన్నోవేషన్‌గా ప్రచారం చేసుకో కూడదు అని అంతర్జాతీయ పేటెంట్‌కు దరఖాస్తు చేసి సాధించాడు. వీరు సాధించిన ఈ ఘనతను నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారి ఆధ్వర్యంలో అమెరికా అధ్యక్షులు జార్జిబుష్ ప్రత్యేకంగా హైదరాబాద్ లోని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో అభినందించారు.

వీరు కనుగొన్న విషయాన్ని తాను మాత్రమే అనుభవించడం కాదని, యావత్ రైతాంగం వియోగించుకుని సమాజానికి ఆరోగ్యకరమైన పురుగు మందుల అవశేషాలు లేని ఆహారం అందించాలని, తాను కనుగొన్న విషయాన్ని 'పల్లెసృజన' ద్వారా యావత్ రైతాంగానికి అందించడమే కాక, ప్రస్తుతం దాదాపు అందరికీ అందుబాటులో వున్న 'సోషియల్ మీడియా' అయిన ఫేస్ బుక్, యు-ట్యూబ్, వాట్స్‌యాప్ ల ద్వారా తను కనుగొన్న విషయాలపై రైతు లోకానికి అవగాహన కల్పిస్తూ రైతు సమాజంలో ఎంతో మార్పుకు సహకరించారు, సహకరిస్తూనే ఉన్నారు.





ఈ విషయాన్ని అవగాహన చేసుకున్న 'పల్లెసృజన' వీరి సేవలకు తప్పనిసరిగా భారత దేశ అత్యున్నత పురస్కారం అందడం సమంజసమని భావించి, మూడు సంవత్సరాలుగా వీరికి 'పద్మశ్రీ' పురస్కారం ఇవ్వాలని దరఖాస్తు చేయగా, 2020లో 'పల్లెసృజన' కృషి ఫలించి, వీరికి "పద్మశ్రీ" పురస్కారం అందించి, రైతు లోకాని కి పెద్దపీట వేసింది భారత ప్రభుత్వం.

రైతు బాంధవుడైన చింతల వెంకట్ రెడ్డి గారిని భారత ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా అభినందిస్తూ, మీరు రైతు లోకానికి అందించిన ఇన్నోవేషన్ వెలకట్టలేనిది అని, దాని వల్ల దేశానికి ఎంతో పేరు ప్రఖ్యాతులు రాగలవని ఆశాభావాన్ని 'మన్‌కీ బాత్'లో దేశ ప్రజలకు చెప్పారు,

చింతల్ వెంకట్ రెడ్డి గారి ద్వారా "పల్లెసృజన" కీర్తి కిరీటంలో మూడో 'పద్మం' వికసించినందుకు యావత్ 'పల్లెసృజన' కుటుంబం ఎంతో సంతోషంగా, గర్వంగా తమ అనుభూతిని తెలియజేసింది. ఈ పురస్కారం 'రైతు లోకానికి అందిన పురస్కారం' గా 'పల్లెసృజన' వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.


గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

పల్లెసృజన

www.pallesrujana.org

పల్లెసృజన

ద్వైమాసిక పత్రిక

మీరు చదవటంతో పాటు మీ తోటివారు కూడా చదివేలా ప్రోత్సహించండి. మీ చుట్టుపట్ల గ్రామాలకు పత్రిక చేరేలా మీవంతు కృషి చేయండి. మరెన్నో నూతన ఇన్నోవేషన్లు, పద్ధతులు వెలుగులోకి వస్తాయి.




కాల, ప్రాంతాలకు అతీతంగా శాస్త్ర విజ్ఞాన జిజ్ఞాస మానవాళిని అంటిపెట్టుకునే వుంది. ప్రాచీన భారత దేశంలో విభిన్న రంగాలలో విశేష కృషి చేసిన మహనీయులు విజ్ఞానాన్ని బహు ముఖాలుగా విస్తరించే ప్రయత్నం చేసిన ఆలోచనాపరులు కోకొల్లలు. ఆర్యభట్టు, వరాహమిహిరుడు, చరకుడు, సుశ్రూతుడు, భాస్కరుడు మొదలైన వారు ఖగోళము, గణితము, వైద్యము లాంటి శాస్త్రాలలో తమ పరిశోధనల ద్వారా కొన్ని మైలురాళ్ళను సృష్టించారు. ఆ కోవలోకి చెందిన వారే 'సురపాలుడు'.

వృక్ష శాస్త్రంలో నిగూఢమైన విషయాలను ఎన్నింటినో పరిశోధించి, అపురూపమైన వృక్ష వైద్య రహస్యాలను గ్రంథస్తం చేసినవాడు సురపాలుడు. మొక్కల లక్షణాలు కూడా మానవుల శరీరాన్ని పోలి వుంటుందన్న శాస్త్ర పరిజ్ఞానాన్ని ఆవిష్కరించినవాడు సురపాలుడు. వృక్ష శాస్త్రంలో విశేషమైన కృషి చేసిన ఈ మహనీయుడి గురించిన సమాచారం ఇటీవలి వరకు మన దృష్టికి రానేలేదు. ఆయన రచించిన "వృక్షాయుర్వేదం" అన్న గ్రంథం ఇంగ్లాండులోని ఒక గ్రంథాలయంలో ఇటీవలే బయట పడింది. ఆ పుస్తక ఆంగ్లానువాదం 'ఏసియన్ అగ్రో హిస్టరీ ఫౌండేషన్ (ఎఎహెచ్ఎఫ్), హైదరాబాద్ వారు **1996**లో ప్రచుంచారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వృక్ష శాస్త్రం పట్ల ఆసక్తిగల ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా పరిశోధకులకు, విద్యార్థులకు, రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో 'ఐ-సర్వ్', హైదరాబాద్ వారు **2015** లో తెలుగు అనువాద ప్రక్రియకు ఉపక్రమించడం జరిగింది.

ఈ గ్రంథాన్ని 'పల్లెసృజన' పాఠకులకు అందించాలన్న సంకల్పంతో మార్చి-ఏప్రిల్ **2021** సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం. ఈ గ్రంథంలోని మహత్తరమైన జ్ఞానాన్ని పాఠకులు అవగాహన చేసుకుని, ఆచరిస్తారని ఆశిస్తున్నాం. **- ఎడిటర్.**

### (గత సంచిక తరువాయి)

135. నెయ్యి, తేనె, 'క్రసరము' (అంటే నువ్వులు, బియ్యం బఠానీలతో తయారు చేసిన మసాల అన్నం) మరియు "లోధము"లను (లొద్దు గ చెట్లను) రేగు, ఉసరి, నేరేడు వృక్షాలకు పూతలాగా పూస్తే లేదా నువ్వులు, తేనె, బార్లీలను పన్నెండు రోజుల పాటు బాగా చికిత్స చేసి ఆ చెట్లకు పోసి, పుష్పించేటప్పుడు నీళ్ళ పాలను పోస్తే మంచి ఫలాలను కాస్తాయి.

136. అదేవిధంగా పైన పేర్కొన్న వృక్షాలకు బాగా నీళ్ళు పెట్టి ప్రతిరోజు ద్రాక్ష సారాయిని చిలకరిస్తే, అవి తేనెలాంటి తియ్యటి మంచి ఫలాలను కాస్తాయి.

137. బెల్లం, నెయ్యి, పాలు, తేనె కలిపిన మిశ్రమాన్ని మారేడు మరియు వెలగ చెట్లపై చిలుకరిస్తే అవి మంచి రసంతో కూడిన ఫలాలను ఇస్తాయి.

138. మొదట కాశము (రెల్లు గడ్డి) కలిపిన మంచినీళ్ళను పట్టాలి. ఆ తర్వాత కుళ్ళిపోయిన గడ్డిని కాల్చి ఎక్కువ మొత్తంలో ఆ బూడిద మరియు ఆవుపేడతో అరటి చెట్ల వేర్ల పాయల వద్ద పూర్తిగా కప్పి వేయాలి. అలా చేస్తే అరటి చెట్లకి లావైన కాయలు కాస్తాయి.

139. మినుములు మరియు బియ్యం నీళ్ళను 'తిండుక' (తుమ్మికి) చెట్లకు పడితే, అవి బాగా పెరుగుతాయి. అలాగే వేప ఆకుల నుండి తీసిన కషాయం 'పారవత' (కోతి తుమికి) చెట్లకు మంచి ఆహారం. అవి బాగా కాసిన పండ్లతో వంగిపోతాయి.

140,141,142, 143, 144, 145, 146, 147.......

148. ఒక అందమైన స్త్రీ మామిడి చెట్టును తన సున్నితమైన వేళ్ళ గోటి మొనలతో గోకితే, దాని వొళ్ళు మొగ్గల రూపంలో గగుర్పాటుకు లోనవుతుంది. "కువార" (?) మొక్క మొదలతో గోకినా అలాగే అవుతుంది.

149. సొగసుగా సున్నితంగా, పద్మాల్లాగా వున్న పాదాలకు 'అలక్తక' రసాన్ని (లత్తుకను) పూసుకుని పాదభూషణాలయిన కాలి పట్టాల తో గలగలమనే శ్రావ్యమైన శబ్దం వస్తుండగా తన అందంచేత మన్మథుని పతాకంలా అలరారుతున్న ఒక సుందరాంగి పాద తాండవం చేస్తే 'అశోక' వృక్షాలు అందంగా వికసిస్తాయి.

150. కమలం పువ్వుల తొడిమెల్లాగా అందంగా ఉండి, అటు ఇటు ఊగు తున్న కరభూషణం అలంకరించుకొని సగసుగా లతల్లాగా ఉన్న హస్తాలతో ఒక మనోహరమైన స్త్రీ కౌగిలించుకుంటే "ఎర్ర గోరింట' మరియు 'తిలక' వృక్షాలు దివ్యంగా వికసిస్తాయి.

151. నవ వధువులాగా అందంగా అలంకరించి, పెళ్ళికూతురుకు వివాహానికి ముందు జరిపే తంతు జరిపి, "శ్యామ" అనే లతను దగ్గర లో ఉన్న ఒక వృక్షానికిచ్చి పెళ్ళిచేస్తే అది పుష్కలంగా వికసిస్తుంది.

152. సూర్యాస్తమయ సమయంలో భక్తితో "మాధవీలత", "కరవీరం" (గన్నేరు), "కురంట" అనే మొక్కలపై సారాయి చలకరించిన అవి బాగా వికసిస్తాయి.

153. గడ్డిని కాల్చి ఆ కదులుతున్న మంటలతో కొద్దిగా కాపడం పెట్టినచో

"మల్లి(క)" మొక్కకు బాగా పువ్వులు పూస్తాయి. పాలు కలిపిన నీళ్ళను ఎక్కువగా పడితే "పాటల" (కలిగొట్టు) అనే తీగ ఎంత బాగా పూస్తుందంటే తేనెటీగలన్నీ దాని చుట్టూనే ఉంటాయి.

154, 155. .......

156. పాసిపోయిన గంజినీళ్ళు కలిపిన నీళ్ళు 'అలంబుక' (గుమ్మడి) తీగకు పట్టినచో అతి తక్కువ వ్యవధిలోనే ఎక్కువ కాయలు కాస్తుంది.

157. ఫాల్గుణ మాసంలో (వసంత కాలం – ఫిబ్రవరి/ మార్చి నెలల్లో) గడ్డిమంటల తాకిడి తిన్న 'పటోల' (పొట్లకాయ) చెట్లపై గానుగ పిండి నీళ్ళు చైత్రం (ఫాల్గుణ మాసం తర్వాత) లో బాగా చిలకరిస్తే మంచి కాయలు కాస్తాయి.

158. ఒక బట్ట పేలికలో కాలిన బూడిదను కట్టి వెచ్చదనాన్ని కలిగించే ఏర్పాటు చేస్తే చలి, మంచు వల్ల సంభవించే నష్టాలను నివారించ వచ్చు.

159. బాగా ఉడికిన అన్నం పెరుగులో కలిపి చేను మొత్తం చిలకరిస్తే వడగండ్ల వాన వల్ల కలిగే దుష్ఫలితాలను నివారించవచ్చు.

160. చేనులు ఎలుకలు లాంటి క్రిమి కీటకాదులు బాగా పీడిస్తే ఈ క్రింది మంత్రాన్ని అరటి ఆకుపై లక్కతో రాసి పొలం మధ్యలో త్రిభుజాకారంలో పెట్టాలి.

161–162. "ఓం స్వస్తి! (శాంతి నెలకొనుగాక!) పాదపద్మములు ఎల్లప్పుడూ విజేతలుగా నిలుచునో, ఎంతటి విపత్కర పరిస్థితులలోను ఎవరు తన ధైర్య సాహసాలు ప్రదర్శిస్తారో, దేవుళ్ళకే దేవుడయి సూర్యుని ఎవరు చెరబట్టాడో, అట్టి ఆంజనేయ స్వామి కిష్కింద నుండి ఈ పొలములో ఉన్న ఎలుకలను, చుంచులను, గొల్లభామలను, కీచురాళ్ళు మున్నగు వాటినన్నింటిని ఈవిధంగా శాసిస్తున్నాడు. "తక్షణమే ఈ పొలమును విడిచిపెట్టి ఎక్కడికయినా వెళ్ళిపొండి. వెంటనే ఈ ఆజ్ఞను శిరసావహించండి లేని పక్షంలో మహాశక్తి వంతుడయిన రాజుగారు పిడుగువలె శక్తివంతమయిన తన వాలాన్ని మిమ్మల్ని చంపివేయడానికి, కాల్చివేయడానికి, సర్వ నాశనం చేయడానికి ఉపయోగిస్తారు".

163. ఈ మంత్రాన్ని ఒక ఆకుపై రాసి, దానిని పఠించి, భూమిలో పాతి పెట్టాలి. ఈ మంత్రం అన్ని పిచ్చుకలను, క్రిములను, గద్దలను, ఎలుకలను, చీమలను నాశనం చేస్తుంది.

164. ఈరకంగా నిరూపించబడ్డ అన్ని రకాల ఆచారకాండను అమలు పరిస్తే నార (చిన్న మొక్కలు), మొక్కలు, పెద్దగా పెరిగిన వృక్షాలతో సహా అన్ని ఉత్తమమయిన, మధ్యస్తమయిన, సామాన్యమయిన చెట్లు అన్ని విధములయిన పీలనుండి, ఇబ్బందుల నుండి దూరం గా ఉంటాయి.

**వ్యాధులు:**

165. వృక్షజాతికి రెండు రకాలయిన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. 1. అంతర్గతమైనవి, 2. బహిర్గతమైనవి.

166. వాత, పిత్త, కఫ (శరీరంల ఉండే విషపు నీరు)ముల వల్ల వచ్చేవి అంతర్గతమయిన వ్యాధులు. క్రిములు, చలిగాలులు, మొదలైన వాటివల్ల వచ్చే రోగాలు బాహ్యమయినవి.

167. పొడిపొడిగాను, ఘాటుగాను ఉండే పదార్థాలు ఎక్కువవడం వల్ల శుష్కించిన నేల వలన వాతం కారణంగా వచ్చే వ్యాధులు సంభవిస్తాయి.



168. కాండము వంకరగా, పలుచగా ఉంటుంది. కాండము మీదగాని, ఆకుల మీదగాని కణుపులు కనిపిస్తాయి. కాయలు గట్టిగా ఉంటాయి. రసం తక్కువగా ఉండి, తియ్యదనం లేని పళ్ళు కాస్తాయి.

169. తియ్యగా, జిడ్డు జిడ్డుగా, పుల్లగా, చల్లగా ఉండే వస్తువులతో ఎక్కువగా నీళ్ళు పడితే, చలికాలంలోను, వసంత కాలంలోను చెట్లకు 'కఫా'నికి సంబంధించిన వ్యాధులు వస్తాయి.

170. "కఫా"నికి సంబంధించిన అనారోగ్య లక్షణాలు ఇవి : చాలా ఆలస్యంగా పళ్ళు కాయడం, పాలిపోయి ఉండడం, ఆకులు కురచగా అయిపోవడం, రుచిలేక పోవడం, అర్థాంతరంగా పళ్ళు పక్వం కావడం.

171. "పిత్తా"నికి సంబంధించిన వ్యాధులు వేసవి కాలం ముగుస్తుండగా వచ్చే అవకాశం ఉంది. మేఘాలు కానరాకుండా పోయినప్పుడు, చేదుగా పుల్లగా ఉప్పగా మందంగా ఉండే పదార్థాలు కలిపిన నీళ్ళను చెట్లకు అవసరానికంటే– ఎక్కువ పట్టినప్పుడు, ఈ రకమయిన వ్యాధులు సంక్రమించవచ్చు.

172. "పిత్తా"నికి సంబంధించిన వ్యాధి లక్షణాలు : ఆకులు పసుపు పచ్చగా మారడం, పళ్ళు అర్థాంతరంగా రాలిపోవడం, పొడిగా తయారవడం, ఆకులు, పూలు, పండ్లు పాలిపోవడం, చెట్లు కృశించిపోవడం.

173. మల మల మాడే ఎండల బారిన చెట్లు పడితే, వాటి వేర్లను పురుగులు తినేస్తాయి. చెట్లు ఎండిపోయి ఆకులు పసుపు పచ్చ రంగులోకి మారి బాగా కృశించి పోతాయి.

174. బలంగా వీచే తుఫాను గాలుల వల్ల చెట్లు కొట్టుకొని పోయే ప్రమాదం ఉంది. అవి విరిగి పడిపోవడమో, వేర్లతో సహా పెకిలి పోవడమో, వంగిపోవడమో జరగవచ్చు. విరిగిపోవడం అనేది రెండు రకాలుగా సంభవించవచ్చు. కొమ్మలు విరిగిపోకుండా చెట్లకే అంటిపెట్టుకుని ఉండడము లేదా అవి విరిగి పడిపోవడము.

175. మెరుపులు, పిడుగులు, అగ్నికి గురికావడం వల్ల శుష్కించిపోయిన నేలవల్ల, నీటి సరఫరా లేకపోవడం మూలంగాను వృక్షాలు ఎండిపోతాయి. ●

**గమనిక :** పైన కొన్ని సంఖ్యలలో ఖాళీగా ఉంచబడినవి. దానికి కారణం. అక్కడ వివరించిన విధానాలు ఎన్నో రకాల అడవి జంతువుల మాంసం, మరియు ఇతర శరీర భాగాలతో చేయవలసిన పనులు. ఇవి రైతులకు సాధ్యం కాదు, పైగా 'మృగ హింస' చట్టానికి గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి వాటిని వివరించటం లేదు.

**(తరువాయి భాగం వచ్చే సంచికలో)**

# 10వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు




**ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో నిర్వహించిన 10వ జాతీయ స్థాయి ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో జాతీయ బహుమతి పొందిన విజేతల వివరాలు**

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి వ్యాసాలకు
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

### జనరేటర్ లోడ్ కంట్రోలర్

**పేరు : లానూ ఎల్. జమీద్**


**నివాసి : దీమాపూర్, నాగాల్యాండ్**



49 సంవత్సరాల లానూ ఎల్ జమీద్ తన నైపుణ్యంతో దీమా పూర్ లోని తానుండే ప్రదేశంలోని స్థానిక ప్రజల దైనందిక సమస్యలకు పరిష్కారాల మార్గాలు కనిపెట్టి ఇస్తూ వుంటాడు. ఎలక్ట్రానిక్స్ విషయాల లో తనకున్న పరిజ్ఞానంతో దీమాపూర్ లో ఒక ఇంజనీరింగ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను నడుపుతూ ఉంటాడు. ఈ కేంద్రంలోనే తను ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌లపై ప్రయోగాలు చేస్తూ, బైటి వారికి కూడా తన కేంద్రంలో ప్రయోగాలు చేసుకుని కొత్త వస్తువులు కనుగొనే అవకాశం ఇస్తూ ఉంటాడు.

హైడ్రోగేర్ అనేది నీటి సహాయంతో కరెంటు ఉత్పత్తి చేసే ఒక పరికరం. దీనితో మూడు నుంచి 5 కిలో వాట్ల కరెంటును ఉత్పత్తి చేయవచ్చు. ఈ పద్ధతినే 'పికో హైడ్రో పవర్ సిస్టం' అంటారు. ఈ పద్ధతి లో ఉత్పత్తి చేసే కరెంటు సహాయంతో ఒక ఇంటికి కావలసిన కరెంటు అవసరాలు తీర్చుకోవచ్చు. కాకపోతే నీటి పారుదలను బట్టి తిరిగే చక్రాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉంటుంది. బయట దేశాల నుండి దిగుమతి చేసుకొన్న ఈ కంట్రోలింగ్ పరికరాలు చాలా ఖరీదైనవే కాక, క్లిష్టమైన సాంకేతిక పద్ధతులలో ఉండి, సామాన్యులు కొని, వాడుకోలేని పరిస్థితి ఏర్పడింది.

లానూ జెమీద్ తన స్వంత ఇంజనీరింగ్ ఇన్నోవేషన్ సెల్ లో



ఎన్నో ప్రయోగాలు చేసి, స్థానిక అవసరాలకి పనికి వచ్చే ఒక కరెంటు నియంత్రణ పరికరాన్ని కనుగొన్నాడు. ఈ ఎలక్ట్రానిక్ లోడ్ కంట్రోలర్ జనరేటర్ నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్తుని నియంత్రించడంతో పాటు స్టెబిలైజర్ లాగా కూడా ఉపయోగ పడుతుంది. అంతే కాకుండా, విద్యుత్ ఉత్పత్తిలో ఓల్టేజ్, స్పీడ్, ఔట్‌పుట్ ఫ్రీక్వెన్సీని కూడా నియంత్రిస్తుంది. ఓల్టేజీని, ఆర్.పి.యం.ను స్థిరంగా ఉంచి, కేవలం ఫ్రీక్వెన్సీలో మార్పు చేస్తూ సింక్రనైజర్‌గా పని చేస్తుంది. 0.9 పవర్ ఫ్యాక్టర్ ఉండొచ్చు.

జమీద్ 2 రకాల లోడ్ కంట్రోలర్ లను తయారు చేశాడు. ఒకటి 5 కిలో వాట్ల వరకు పనికి వచ్చేది, రెండోది 100 కిలో వాట్ల వరకు పని చేసేది. దీమాపూర్ లోని విద్యుత్ సరఫరా సంస్థ వారు ఈ రెండూ కూడా అద్భుతంగా పని చేస్తున్నాయని నిర్ధారించారు.

ఈ పరికరాన్ని తక్కువ ఖర్చులో తయారు చేసినందుకు గాను లానూ జమీద్ కు ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి

గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 కి గాను 'లానూ ఎల్ జమీద్' ను జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.

## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

## చెట్లనుండి లక్కను సేకరించే యంత్రం



**పేరు: సౌరవ్ డే**

**నివాసి: సింగ్ భమ్, జార్ఖండ్**

జార్ఖండ్ లోని సింగ్‌భమ్ ప్రాంతానికి చెందిన సౌరవ్ డె అతి సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వాడు. అయినా ఎప్పటికైనా ఎలక్ట్రికల్ ఇంజనీర్‌ను అవ్వాలని కలలు కనేవాడు. అనేక కష్టాలను ఎదుర్కొని, చివరికి ఎలక్ట్రికల్ ఇంనీరింగ్‌లో డిప్లమా చేయ గలిగాడు. చిన్నప్పటి నుంచి కూడా సౌరవ్‌కు యంత్రాలని, అవి నడిచే తీరును చాలా ఉత్సాహంతో గమనించేవాడు. అసలు ఈ లక్క శుద్ధి చేసే యంత్రం చేయాలన్న ఆలోచన అతను పాఠశాలలో చదువుకునే రోజుల్లోనే వచ్చింది.

లక్కను తయారు చేసే ప్రక్రియలో 5 ముఖ్యమైన దశలు ఉంటాయి. మొదటిది ప్రూనింగ్. రెండోది ఇనాక్యులేషన్ (టీకాలు వెయ్యటం). మూడోది ముడి బంకను తీయటం. నాలుగోది ఎండబెట్టడం. ఐదోది శుద్ధి చేయటం. చెట్లనుండి వచ్చి, ఎండిన ముడి లక్కను చాకుల సహాయంతో తీయడం. ఈ పనులన్నీ కూడా ఏ యంత్రా ల సహాయమూ లేకుండా మానవ శ్రమతోనే చేయాల్సి ఉంటుంది. సాధారణంగా రైతులు రెండు పద్ధతులను ఉపయోగిస్తూ ఉంటారు. ఒకటి ముడి లక్క చుట్టూ గుంపుగా కూర్చొని చిన్న చాకు లేదా కొడవళ్ల సహాయంతో లక్కను వేరు చేయటం లేదా ముడి లక్కను వెదురు కర్రలతో కొట్టి లక్కను వేరు చేయటం. ఏ పద్ధతిలో చేసినా కూడా ఒక వ్యక్తి రోజుకి 5–10 కిలోల లక్కకన్నా వేరు చేయలేరు. ఈ వేరు చేసే పద్ధతి క్రింద నేలమీద కూర్చుని చేస్తారు కనుక లక్కతో పాటు ఇసుక, మట్టి, చిన్న చెక్క ముక్కలు, చెట్టు బెరడు ముక్కలు కూడా కలిసి వుండి, లక్క నాణ్యత తరిగి, మార్కెట్‌లో తక్కువ ధర పలుకుతుంది. అదీ కాక ఈ పద్ధతులలో లక్క తీయటం అన్నది చాలా శ్రమతో, నిదానంగా జరిగే పని.



చిన్నప్పుడు సౌరవ్ చెరుకు నుండి రసం తీసే యంత్రాలని చూసి, అదే తిరిగే పద్ధతిలో లక్క శుద్ధి చేసే యంత్రం కూడా ఎందుకు చేయ కూడదు అని ఆలోచించాడు. సౌరవ్ తయారు చేసిన యంత్రము కంప్రెషర్ పద్ధతిలో చెట్టు నుండి లక్కను కోస్తుంది. చెట్టు బోద నుండే కాక, కొమ్మల నుండి కూడా సునాయాసంగా చెట్టు బెరడు ముక్కలు రాకుండా వీలైనంత వరకు కేవలం లక్కను మాత్రమే తియ్యడానికి ఉపయోగ పడుతుంది ఈ యంత్రం. ఈ యంత్రం వాడకం ద్వారా ఏ విధమైన చెత్త, ఇసుక కలవకుండా, కేవలం చెట్టు నుండే నేరుగా లక్కను సేకరించవచ్చు. దీంతో లక్క నాణ్యత పెరిగి మంచి ధర పలకటమే కాకుండా, ఎక్కువ శ్రమ లేకుండా, లక్కను సేకరించే అవకాశం కలుగుతుంది.

లక్క సాగు/ పరిశ్రమలో ఎక్కువ శ్రమ లేకుండా, నాణ్యత గల లక్కను సేకరించే రైతులకు మంచి ధర పలికేలా సహాయపడే ఈ యంత్రాన్ని కనుగొన్నందుకు గాను సౌరవ్ డె కు ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.

## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

## తివాసీలను చుట్టే యంత్రం



**పేరు: జూఫా ఇక్బాల్**

**నివాసి: శ్రీనగర్, జమ్మూ & కాశ్మీర్**

కాశ్మీర్‌కు చెందిన 20 సం. జూఫా ఇక్బాల్‌ను పాఠశాలలో చదువుకుంటున్న రోజులలో కూడా జూనియర్ సైంటిస్ట్ అని ముద్దుగా పిలిచేవారు. ఆమె ఆ వయసు నుంచి కూడా తన చుట్టూ ఉండే ప్రజల దైనందిక అవసరాలు తీర్చటానికి ఎన్నో సలహాలు ఇస్తూ ఉండేది. అవకాశం ఉన్న చోటల్లా, చిన్న పనిముట్లు, యంత్రాలు కూడా చేసి ఇచ్చేది. తను చదువుకునే రోజుల నుంచి కూడా ఆమె కవితలు వ్రాయటం, వక్తృత్వ పోటీలలో పాల్గొనటం చాలా ఇష్టం. ప్రస్తుతం ఆమె ఇరాన్ దేశంలో మెడికల్ కోర్సు చదువుతోంది. ఈ తివాసీలు చుట్టే యంత్రం ఆలోచన ఆమె చిన్నప్పుడు పాఠశాలలో చదువుతూ ఉండగానే వచ్చింది.

కాశ్మీరీ నమదా (కాశ్మీరీ ఉన్ని తివాసీ) అనేది పలుచని పరుపులాగానే ఉంటుంది. పూర్తిగా ఉన్నితో చేసింది. చల్లని ప్రదేశాలలో నేల నుండి చలి కాకుండా ప్రత్యేకించి ఈ నమదాలను వాడుతూ ఉంటారు. ఈ కాశ్మీరీ తివాసీలను చేసే పద్ధతి ప్రత్యేకంగా ఉంటుంది. ఉన్నిని దారంలాగా పేని, మగ్గాలపై బట్టలా నేసే పద్ధతి కాకుండా, ఈ నమదాలను ముడి ఉన్నికి వివిధ రకాల రంగులు అద్ది, పలుచగా ఒక చాపపై పరిచి దానిపైన చిక్కటి సబ్బునీళ్లు చల్లుతారు. ఆ తరువాత





మొత్తం చాపని గట్టిగా చుట్టలా చుట్టి, నేలమీద వీలైనంత బలంతో దొర్లిస్తారు. ఇలా కొన్ని గంటల సేపు చేయాల్సి ఉంటుంది. తరువాత చుట్టిన చాపను విప్పగా, సన్నని ఊలు బట్టలా తివాసీ తయారై ఉంటుంది. దీనిని కావలసిన సైజుల్లో కత్తిరించుకొని, డిజైన్లు వేసి తివాసీలుగా విక్రయిస్తారు. మౌళికంగా ఉన్నితో దారం తీయకుండా, ఉన్నినే అంటించి, ఫైబర్ టు ఫైబర్ ఫెల్టింగ్ పద్ధతిలో తయారు చేసే తివాసీలను 'నమదా' పద్ధతి అంటారు. ఈ నమదా తివాసీలు అందంగా ఉండి, మంచి ధర పలికినా, తయారు చేయటం అనేది చాలా శ్రమతో కూడుకున్న పనే కాకుండా చాలా సమయం కూడా పడుతుంది. దీనికి పరిష్కారంగా జుఫా ఇక్బాల్ ఒక యంత్రం కనుగొంది.

ఈమె కనుగొన్న యంత్రంలో చాపను చుట్టగా చుట్టకుండా, ఒక రోలర్‌పై చుట్టాల్సి ఉంటుంది. ఈ రోలరు దాదాపు మన చెరుకు రసం తీసే యంత్రం పద్ధతిలో పని చేస్తుంది. బలంగా తివాసీని ముందుకు, వెనక్కు తిప్పుతూ ఉంటుంది. దానితో మానవ శ్రమ లేకుండా యంత్రం సహాయంతో ఉన్ని పలుచగా తివాసీలా తయారు చేసేందుకు తోడ్పడుతుంది. ఈ యంత్రం ఉపయోగిస్తే చేసితో తయారు చేసిన తివాసీ కన్నా నాణ్యమైన, అందమైన తివాసీలను తయారు చేసుకోవచ్చు. ఈ యంత్రానికున్న మరో ప్రత్యేకత ఏమిటంటే మనకు ఎంత మందంగా తివాసీ కావాలంటే అంత మందంగా అయ్యేలా యంత్రంలో మార్పులు చేసుకోవచ్చు. చేతితో తివాసీ చేయటానికి కొన్ని గంటలు పట్టే స్థానంలో ఈ యంత్రాన్ని ఉపయోగించే 7–10 నిమిషాలలోనే తివాసీ బట్టను తయారు చేసుకోవచ్చు. ఈ యంత్రం తయారు చేయటం వలన నమదా తివాసీ కార్మికులకు తక్కువ సమయంలో ఎక్కువ నాణ్యమైన ఉత్పత్తి రావటంతో ఆర్థికంగా చాలా సహాయకారిగా నిలిచింది.

కాశ్మీరులో ఉన్న పరిశ్రమ కార్మికులకు పనికి వచ్చే తేలికైన, చవకైన యంత్రాన్ని రూపొందించి ఇచ్చిన జూఫియా ఇక్బాల్ కు ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవే షన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో జాతీయ స్థాయిలో ప్రోత్సా హక పురస్కారంతో సత్కరిం చారు.

## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

## మేలురకం జాజికాయ - ఎడవరంబిల్ గోల్డ్

**పేరు: ఇ.వి. థామస్**

**నివాసి: ఇడుక్కి, కేరళ**



కేరళ రాష్ట్రం లోని ఇడుక్కి ప్రాంతానికి చెందిన 58 సం.ల వయ స్సు గల థామస్ తన తండ్రి తాతల నుండి నేర్చుకొన్న సాంప్రదాయ పద్ధతిలో లవంగాలు, మిరియాలు, జాజి కాయ మొదలైన సుగంధ ద్రవ్య పంటలు గత 40 సంవత్సరాల నుండి పండి స్తూ ఉన్నాడు. 8వ తరగతి తో చదువు ఆపేసి, సాంప్రదాయ పద్ధతిలో సుగంధ ద్రవ్యాల నర్సరీలను ఏర్పాటు చేయటం, తాను స్వయంగా విత్తటం, ప్రాచుర్యం కల్పించడంలో ఎక్కువ శ్రద్ధ చూపిస్తూ వచ్చాడు. తన స్వంత నర్సరీలోనే ప్రయోగాలు చేసి 'ఎడవారింబిల్ గోల్డ్' అనే ఎక్కువ దిగుబడి వచ్చే జాజికాయ రకాన్ని రూపొందించాడు. ఈ రకం ఆ ప్రాంతంలో చాలా మంచి పేరు తెచ్చుకొంది.

1980 ప్రాంతంలో కారణం తెలియని వ్యాధితో వీరి స్వంత జాజికాయ పంట నాశనం అయింది. కొంత కాలం బాధపడినా,



నిరుత్సాహ పడక సాంప్రదాయ పద్ధతి లోనే పెరిగిన జాజికాయ విత్తనాలు, అంటు కట్టే పరికరాలు సేకరించి తిరిగి సేద్యం మొదలు పెట్టాడు. తనకు తెలిసిన విద్యయే అయినా సాంప్రదాయ జాజికాయ నర్సరీ ద్వారా ఇతరులకి మొక్కలు సరఫరా చేయడం, చేస్తూ వుండే క్రమంలో 1999లో తన కోసమని వేసుకున్న చెట్లలో కొన్ని (4–5 చెట్లు) చాలా పొడవుగా, ఎత్తుగా కాకుండా, కురచగా, పక్క కొమ్మలు వేసుకుంటూ వెడల్పుగా పెరగడం గమనించాడు. ఇదేదో విచిత్రంగా ఉంది, పళ్ళని కోయటం చాలా సులువు అవుతుందన్న అభిప్రాయంతో ఆ విత్తనాలనే సేకరించి, విత్తనాలు, గ్రాఫ్టింగ్ పద్ధతిలో రెండు తరాల చెట్లని పెంచాడు. 2004 నాటికి తాను అనుకున్న లక్షణాలు అంటే పరిమాణం, సువాసన, రంగు మొదలైనవి సమకూరాయని నిర్ధారించుకున్న తర్వాత ఆ పద్ధతిని స్థిరీకరించి, ఆ రకానికి "ఎడవేరంబిల్ గోల్డ్" అని నామ కరణం చేశాడు. అప్పటికి ఆయన దగ్గర పళ్ళు కాసే దశలో వున్న 50 చెట్లు ఉండగా, అందులో 20 చెట్లు 15 సంవత్సరాల కన్నా ఎక్కువ వయసున్నవి. ఈ రకం పదేళ్ళ వయసు నుంచి చెట్టుకి సంవత్సరానికి 200 కిలోల వరకు పళ్ళను ఇస్తుంది. పళ్ళను 5 రోజుల వరకు నిలువ ఉంచుకోవచ్చు. ఈరకం ప్రత్యేకత ఏమిటంటే నీడ ఎక్కువ గల ఏలకు తోటలలో కూడా దీన్ని వేసుకోవచ్చు. ఈ రకానికి పెద్ద కాయలు, ఎర్రని పై పొర కలిగి చూడటానికి అందంగా ఉండి మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది. ఈ గింజలనుండి 13–15 శాతం నూనెను తీసుకోవచ్చు. ఇది సాధారణ రకంలో వచ్చే నూనెకన్నా చాలా ఎక్కువ.

ఎన్.ఐ.ఎఫ్. ఇండియా వారి సహాయంతో కోజికోడ్ లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పైస్ రీసర్చ్ వారి సహకారంతో దీని నాణ్యత, బయో కెమికల్ విశ్లేషణ చేయించడం జరిగింది. వారి నివేదికలో ప్రోత్సాహకరమైన ఫలితాలు దొరికాయి. ఉదా.: నూనె శాతం 13–15, ఫెనాల్ శాతం 20.7 మి.గ్రా. (జి.ఎ.ఇ./గ్రా.) మరియు ఆల్ఫా లెమనోని దాదాపు 10% ఉన్నాయట. ఇది సాధారణ రకాలతో పోలిస్తే చాలా ఎక్కువ. వీటి కారణంగానే గింజ పెద్దగా ఉండటంతో మార్కెట్ లో మంచి ధర పలుకుతోంది. ప్రస్తుతం ఇడుక్కి జిల్లాలో దాదాపు 2 ఎకరాలలో ఈ రకాన్ని పండిస్తున్నారు.

సుగంధ ద్రవ్యాలలో/ ఆయుర్వేదంలో అతి ముఖ్యపాత్ర వహించే జాజికాయ సేద్యంలో మంచి రకాన్ని రూపొందించి అందించిన ఇ.వి. థామస్ గారికి, ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.

**పరికరాల కొరు సంప్రదించండి, సుభాష్ చందర్, 9652801700**

# ఆయుర్వేద జ్ఞాన మథనం



- 'వైద్య' ఉమా మహేశ్వర రావు

## 'పోపుల పెట్టె' - "ఔషధ గని" :

వంట గదిలో తప్పనిసరిగా ఉండే వస్తువులలో 'పోపుల పెట్టె' ప్రధానమైనది. అందులో వున్న వస్తువులు "జీలకర్ర, దాల్చిన చెక్క ధనియాలు, మిరియాలు, పసుపు, శొంఠి, గసగసాలు, ఆవాలు, వెల్లుల్లి మెంతులు, వాము" లాంటి పదార్థాలు ఉంటాయి. వీటిలోని ఔషధ గుణాలను గురించి తెలుసుకుందాం.

**జీలకర్ర:** జీలకర్ర మంచి 'ఒత్తిడి'ని తగ్గించేందుకు బాగా పని చేస్తుంది.

**దాల్చిన చెక్క:** నాడీ వ్యవస్థమీద ఎంతో సమర్థవంతంగా పని చేస్తుంది. చర్మ వ్యాధులకు దూరంగా ఉంచుతుంది. చర్మ వ్యాధులకు పైపూతగా కూడా దీన్ని వాడవచ్చు. జ్ఞాపక శక్తిని పెంచుతుంది.

**ధనియాలు :** జీర్ణక్రియకు సంబంధించిన ఇబ్బందులను తొలగిస్తుంది. శరీరం వేడి చేసినప్పుడు చలువ చేసే గుణం దీనికుంది. ఇందులో క్యాల్షియం, ఐరన్, విటమిన్ డి-1, డి-2, సి- విటమిన్‌లు ఉంటాయి. శరీరానికి ఎంతో క్రొవ్వు అవసరమో అంతవరకే ఉంచి, మిగతా ఎక్కువ క్రొవ్వును శరీరం నుండి తీసివేసే గుణం దీని సొంతం. మంచి పోషక పదార్థం. వీటికి క్యాన్సర్‌ను నిరోధించే శక్తి కూడా ఉందని తాజాగా జరిగిన పరిశోధనలలో వెల్లడయింది.

**మిరియాలు:** మిరియాలు రక్త శుద్ధికి చాలా బాగా పని చేస్తాయి.

**పసుపు :** అద్భుతమైన ప్రకృతిపరంగా మనకు లభించిన 'యాంటీ బయాటిక్'. ఇందులో కూడా క్యాన్సర్‌ను నివారించే గుణం ఉంది.

అల్లం : అల్లంను చిన్న చిన్న ముక్కలుగా చేసి, నిమ్మరసంలో వేసి, అందులో కొద్దిగా సైంధవ లవణం వేసి ఒక గిన్నెలో ఉంచి దానిపైన ఒక మూత మూసి, రాత్రంతా అలాగే ఉంచి, ఉదయం లేవగానే పరగడుపున నాలుగు ముక్కలు నమిలినట్లయితే మంచి ఆకలి గుణాన్ని కలిగిస్తుంది. ఊపిరి తిత్తుల జబ్బుతో బాధపడే వారు ఈ విధంగా చేసినట్లయితే మంచి గుణం కనిపిస్తుంది.

**శొంఠి :** శొంఠిని పొడిగా చేసుకుని, అందులో కొద్దిగా సైంధవ లవణం కలిపి ఒక గాజు సీసాలో వుంచుకుని, రోజుకు ఒక్కసారి ఒక చెంచాడు తిన్నట్లయితే అజీర్తి వ్యాధుల నుండి విముక్తి పొందవచ్చు.

**గసగసాలు :** పెరుగులో గసగసాలు వేసుకుని తిన్నట్లయితే శరీరంలోని నవ రంధ్రాలలో ఎటువంటి రక్తస్రావం కలిగినా సరే నివారిసస్తుంది. కొందరికి ముక్కుల్లో, కొందరికి చెవుల్లో, మరి కొందరికి మల ద్వారం వద్ద రక్తస్రావం కలుగుతూ వుంటుంది. అటువంటి వారు ఈ ప్రక్రియను చేపట్టినట్లయితే ఈ సమస్యనుండి ఉపశమనం పొందవచ్చు. గుండె జబ్బులు వున్నవారు గసగసాలను దోరగా వేయించి, అందులో పటిక బెల్లం కలుపుకుని తిన్నట్లయితే మంచి ఫలితం ఉంటుంది. గసగసాల నూనె కూడా ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తోంది. ఈ నూనె తెచ్చుకుని అప్పుడప్పుడూ కంటిలో ఉదయం, సాయంత్రం 5 చుక్కల చొప్పున వేసుకున్నట్లయితే కంటికి సంబంధించిన చాలా రకాల సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. కంటికి సంబంధించిన నరాలు మూసుకు పోయి, ఆపరేషన్ అవసరం అనుకునే పరిస్థితికి చేరుకోకుండా చేస్తుంది.

**ఆవాలు :** ఆవ నూనెకు కుష్టు వ్యాధి రాకుండా కాపాడే శక్తి ఉంది కాబట్టి అప్పుడప్పుడూ ఆవనూనె వాడుతూ వుంటే మంచిది. ఆవనూనెలో కొబ్బరి పొడి కలుపుకుని తలకు పట్టించుకున్నట్లయితే తలలో పేలు రాకుండా కాపాడుకోవచ్చు. మార్కెట్‌లో 'తెల్ల ఆవాలు' లభిస్తాయి. ఇవి స్త్రీల పాలిట వరం. వాళ్ళ మర్మాయవాల్లో వున్న క్రిమి దోషాలను దూరం చేస్తాయి. ఆవ నూనె, కొబ్బరి నూనె, నువ్వుల నూనెలను సమానంగా తీసుకుని కలిపి మొహానికి పట్టించుకున్నట్లయితే మొహంపైన వున్న మచ్చలు, మొటిమలు, పులిపిర్లు లాంటివి ఏవి వున్నా నివారించే గుణం ఉంది. ఆవపిండి, వరి పిండి కలిపి స్నానం చేసేటపుడు వంటికి పట్టించుకున్న ట్లయితే వంటిపైన చర్మవ్యాధులు ఉండవు, శరీరం నిగనిగలాడుతూ వుంటుంది.

**వెల్లుల్లి :** జీర్ణశక్తికి బాగా పని చేస్తుంది, ఆకలి గుణాన్ని కలిగిస్తుంది, మూత్రంలో రాళ్ళను కరిగిస్తుంది. వెల్లుల్లి తిన్న తరువాత గోరువెచ్చటి నీరు త్రాగినట్లయితే శరీరానికి మంచి ఫలితం ఉంటుంది.

**మెంతులు :** మెంతి కూర తో చాలామంది పప్పు చేసుకుంటూ వుంటారు. ఈ పప్పు తినటం వల్ల శరీరంలో రక్తశుద్ధి కలిగిస్తుంది. శరీరంలోని అనవసరపు పదార్థాలను బయటకు నెట్టివేసే గుణం మెంతి కూరకు ఉంది. విరోచనాలు అయ్యే వారు పెరుగులో మెంతులను కలుపుకుని తిన్నట్లయితే విరోచనాలు తగ్గిపోతాయి. నోటిపూత వున్నవారు మెంతులను నీటిలో రాత్రంతా నానబెట్టి ఉదయం తిన్నట్లయితే నోటి పూత ఉండదు.

**వాము :** శరీరంలోని అన్న రకాలుగా రక్తాన్ని శుద్ధి చేసి, రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చేసే గుణం కలది వాము. అధిక రక్తపోటు వున్న వారికి రక్తపోటును అదుపు చేసే గుణం కూడా కలిగి వుంది. కొంత మంది నోట్లో ఇబ్బందిగా వుండి నాకు ఏదీ రుచి తెలియటం లేదు అన్న వారు వాములో కొద్దిగా సైంధవ లవణం వేసుకుని నమిలినట్లయితే నోటికి సంబంధించిన చెడు పదార్థాలను శుభ్రం చేసి, నోటికి రుచి అందేలా చేస్తుంది. వామును కషాయం చేసుకుని త్రాగితే మూత్ర పిండాలలోని రాళ్ళు కూడా కరిగిపోయే అవకాశం వుంటుంది. వాము ఆకుతో బజ్జీలు చేసుకుని తినవచ్చు. అరిగించే గుణం వాముకుంది.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 94402 86854

### అపాన వాయువుల సమస్య నివారణకు చిట్కా:

కొంతమంది అపాన వాయువుల సమస్య అంటే త్రేపులు, మల ద్వారం ద్వారా వెళ్ళే వాయువు (పిత్తులు) లతో చాలా బాధ పడుతూ వుంటారు. ఈ సమస్య పరిష్కారానికి పచ్చి అరటి కాయను నీడలో బాగా ఎండబెట్టి అది ఎండిన తర్వాత దాన్ని మెత్తటి పొడిగా చేసుకోవాలి. ఆ తర్వాత ఒక గ్లాసు మజ్జిగలో కొద్దిగా పటిక బెల్లం, ఒక స్పూను అరటి కాయ పొడి వేసుకుని ఒక వారం రోజులు త్రాగినట్లయితే అపాన వాయువుల సమస్య నుండి సాంతన పొందవచ్చు.

### సంతాన లేమి సమస్య కల వారికి ఆయుర్వేద వైద్యం:

కొందరు మహిళలకు గర్భంలో గొడ్డు పురుగులు వున్నట్లయితే అటువంటి వారికి సంతానం కలుగక మానసికంగా ఇబ్బంది పడుతూ వుంటారు. అటువంటి మహిళలు 'దుసర తీగ' ఆకులను గుప్పెడు తీసుకొని శుభ్రంగా కడిగిన తర్వాత ఒక పళ్ళెంలో గ్లాసు నీటిని పోసుకుని అందులో ఈ ఆకులను వేసి చేతితో బాగా మెత్తగా పిసుక్కోవాలి. ఆ తర్వాత ఆకులోని రసం మొత్తం నీటిలో కలిసి కొద్దిసేపటిగా ఆ నీరు పెరుగులాగా బాగా గడ్డ కడుతుంది. ఆ గడ్డను రోజూ ఒక స్పూనుతో తీసుకుని నోట్లో వేసుకుని తినాలి. ఒకవేళ నేరుగా దాన్ని తినలేని వాళ్ళు దానిపైన కొద్దిగా పటిక బెల్లం వేసుకుని తీసుకున్నా సరిపోతుంది. దీన్ని మహిళలు నెలసరి ఋతుక్రమం జరిగిన 4–5 రోజులు తినాలి. అయితే ఈ సమయంలో మసాలాతో కూడిన ఆహారం, మాంసాహారం తినవద్దు. వీలైనంత వరకు మజ్జిగ అన్నం, అందులో నంజుకోవడానికి ఎల్లిపాయ కారం వేసుకుని తినాలి. ఇలా చేసిన చాలామంది మహిళలు పండంటి బిడ్డలను ప్రసవించడం జరిగింది.

దీన్ని పురుషులు కూడా తీసుకోవచ్చు. వారు మూత్రాశయం లో వున్న ఎటువంటి రోగమైనా నివారించ బడుతుంది. దీన్ని తెలియజేయటానికి అంత వరకు మూత్రం పచ్చగా వచ్చే వారికి మూడు రోజులు వాడిన తర్వాత నాలుగో రోజు నుండి మూత్రం తెల్లగా కొబ్బరి నీళ్ళలాగా రావటం గమనించవచ్చు. తెలియకుండా మూత్రంలో వీర్యం పడిపోయే వారికి కూడా ఆ సమస్య నుండి నివారించ బడుతుంది. ఈ వైద్యాన్ని 5 సంవత్సరాల పిల్లల నుండి 90 సంవత్సరాల వృద్ధుల వరకు ఉపయోగించుకోవచ్చు. దీన్ని కొద్దిగా ఎక్కువ, తక్కువ తీసుకున్నా ఎటువంటి ప్రమాదమూ లేని వైద్యం.

### నీళ్ళ విరోచనాల నివారణకు ప్రకృతి చికిత్స:

నీళ్ళ విరోచనాలతో బాధపడే వారు దానిమ్మ చెట్టు యొక్క లేత ఆకులు, లేత కాయలు, లేత బెరడులలో దేన్నయినా సరే సేకరించి, నోట్ల వేసుకుని కసకసా నమిలి మింగినట్లయితే ఎటువంటి నీళ్ళ విరోచనాలు ఉన్నవారయినా సరే ఒకటి రెండు గంటల్లో ఉపశమనం పొందవచ్చు.

### పురుషుల అంగస్తంభన సమస్య నివారణకు చిట్కా:

కొంతమంది పురుషులు అంగ స్తంభన సమస్యతో బాధ పడుతూ వుండి మానసికంగా కృంగిపోతూ వుంటారు. అటువంటి వారికి కేవలం వంటింట్లోనే అద్భుతమైన చిట్కా ఉంది. అంగ స్తంభన, శీఘ్ర స్ఖలనం, నిద్రలో స్కలనం లాంటి సమస్యలన్నింటినీ నివారిస్తుంది చిట్కా. ఈ సమస్యలతో బాధపడే వారు ప్రతి రోజూ రాత్రి పడుకోబోయే ముందు అంటే భార్యతో సంగమానికి కొద్దిగా ముందు ఒక ఉల్లిగడ్డను తీసుకుని చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని, ఆవు నెయ్యిలో దోరగా వేయించి, కొద్దిగా చల్లారిన తర్వాత నేరుగా నోట్లో వేసుకుని తిన్నట్లయితే చాలా కొద్ది రోజుల్లోనే పైన చెప్పిన సమస్యల నుండి విముక్తి పొందవచ్చు.



- 'వైద్య' కొమెర జాజి

### శరీరంలో చెడు క్రొవ్వు నివారణకు వైద్యం:

కొంతమంది శరీరంలో చెడు క్రొవ్వు పెరిగి పోయి చాలా ఇబ్బంది పడుతూ వుంటారు. దీని నివారణ కోసం ఎంతో మంది డాక్టర్లను సంప్రదించి, వేలాది రూపాయలు ఖర్చు చేసుకుంటూ వుంటారు. ఇటువంటి వారు కేవలం వంటింటి చిట్కాతో తమ సమస్యను నివారించుకోవచ్చు. ఇందుకోసం వారు చేయాల్సిందల్లా ఒక్కటే ప్రతి రోజూ ఉదయం పలహారం తీసుకునే ముందు మొదటి ముద్దలో మూడు వెల్లుల్లి రెబ్బలను వేసుకుని తింటూ వుంటే చాలు. శరీరంలోని చెడు క్రొవ్వు తొలగి పోవటంతో పాటు, రక్తంలోని చెడు పదార్థాలను కూడా తీసివేయబడి, రక్తపోటు, గుండె జబ్బుల నుండి కూడా నివారణ పొందవచ్చు. ఇలా పక్షం రోజులు చేయటం వల్ల నరాల్లోని క్రొవ్వు మొత్తం కరిగిపోతుంది.

ఈ సమస్య నుండి నివారణకు మరో చిట్కా కూడా ఉంది. ప్రతి రోజూ ఒక కప్పు ఆవు పెరుగు తీసుకుని, ఆవు పెరుగు లభించని వాళ్ళు గేదె పెరుగు అయినా సరే తీసుకుని అందులో 5 వెల్లుల్లి రెబ్బలను చిన్న చిన్న ముక్కగా చేసుకుని పెరుగులో వేసుకుని తీసుకున్నా సరే శరీరం లోని చెడు క్రొవ్వు నివారించబడి, రక్త నాళాలు శుభ్రంగా తయారు అవు తాయి. పక్షవాతం, గుండె జబ్బుల లాంటి వాటిని దూరంగా ఉంచవచ్చు.

### మొలల వ్యాధి నివారణకు అద్భుతమైన చిట్కా:

చాలా మంది మొలల వ్యాధితో బాధ పడుతూ ఎక్కువ సేపు కూర్చోలేక, ఏ పని చెయ్యలేక ఇబ్బంది పడుతూ వుంటారు. వీటి నివారణ కు ఉత్తరేణి ఆకు అద్భుతమైన ఔషధం. ఉత్తరేణిలో రెండు రకాలు ఉంటాయి. ఒకటి ఆకుపచ్చ ఉత్తరేణి, రెండవది ఎరుపు ఉత్తరేణి. ఏదైనా ఫర్వాలేదు కానీ, ఎరుపు ఉత్తరేణి అయితే ఇంకా శ్రేష్ఠం. ఉత్తరేణి చెట్టు వేరును తీసుకుని, నీటితో శుభ్రంగా కడిగిన తర్వాత బియ్యం కడిగిన నీటిని కొద్దిగా తీసుకుని, ఈ ఉత్తరేణి వేర్లను ఒక శుభ్రమైన గరుకు రాయి పై గంధం తీసినట్టు రుద్దాలి. అలా వచ్చిన గంధాన్ని ఒక స్పూను తీసుకుని, దాన్ని తేనెలో కలుపుకుని ప్రతి రోజూ ఉదయం పూట నోట్లో వేసుకున్నట్లయితే ఒక పక్షం రోజుల్లో మొలల వ్యాధి నుండి నివారణ పొందవచ్చు.

మొలల వ్యాధి నివారణకు మరో చిట్కా ఏమిటంటే, పెద్ద ఉసిరి కాయలు తీసుకుని దాన్ని పగలగొట్టి విత్తనాన్ని బయటకు తీసివేసి, నీడలో ఆరబెట్టాలి. అలాగే తిప్పతీగను కూడా సేకరించి, దాన్ని కూడా నీడలో బాగా ఆరబెట్టాలి. రెండూ బాగా ఆరిన తర్వాత వాటిని మెత్తటి పొడిగా చేసి పెట్టుకుని ప్రతిరోజూ ఉదయం పరగడుపున ఒక గ్లాసు మజ్జిగలో ఒక చెంచాడు పొడి వేసుకుని పక్షం రోజుల పాటు తీసుకుంటే మొలల వ్యాధి నుండి నివారణ పొందవచ్చు.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం. : 9908411700**

ఎడిటర్ గారికి,

నేను గత సంవత్సరం డిశంబర్ మాసంలో 'పల్లెసృజన' నుండి వీరరాఘవ రెడ్డి గారి ద్వారా 100 హరిమాన్-99 ఆపిల్ మొక్కలు తెప్పించుకుని నాటడం జరిగింది. ఈ సంవత్సరం మొక్కలు ఇలా ఆరోగ్యంగా పెరుగుతున్నాయి. దాదాపు అన్ని మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతున్నాయి (కొన్ని మొక్కల ఫొటోలను పంపుతున్నాను). కొత్తరకం పంటలు, పరికరాలు లాంటి ఇన్నోవేషన్‌లను రైతులకు అందించి రైతులు బాగుండాలని, నూతన విధానాలను రైతులకు పరిచయం చేస్తున్నందుకు ధన్యవాదములు. మొక్కలు, విత్తనాలు పరిచయం చేయటమే కాక, ఒక ప్రత్యేకమైన 'వాట్స్ యాప్' గ్రూపులను ఏర్పాటు చేసి, రైతులంతా ఒకరి పద్ధతులు మరొకరు తెలుసుకునేలా అనుసంధానం చేస్తూ, అవసరమైన సలహాలు అందిస్తున్న మీ కృషి అభినందనీయం. ఇలాంటి కొత్తరకం పంటలను మన తెలుగు రైతులకు పరిచయం చేసి, రైతులు అధిక దిగుబడులు సాధించడానికి, ఖర్చులు తగ్గించుకునే పద్ధతులను ఇంకా ఎన్నింటినో పరిచయం చేస్తూనే ఉండాలని మనసారా కోరుకుంటున్నాను.

**- పి.వి.యస్. వర్మ**, తేటగుంట, తూర్పు గోదావరి జిల్లా, ఆం.ప్ర. ఫోన్ : 9948355589

**వర్మ గారూ,**

మీరు మొక్కలను చాలా బాగా పోషణ చేస్తున్నారని మొక్కలను చూస్తే అర్థమవుతోంది. మొక్కలు చాలా ఆరోగ్యంగా పెరుగుతున్నాయి. ఈ సంవత్సరం కూడా చాలామంది రైతులు మొక్కలు నాటడం జరిగింది. మీలాంటి రైతులకు మీరు చేసిన విధానాలను తెలియజేస్తే వారు కూడా తమ మొక్కలను ఆరోగ్యంగా పెంచుకుని, అందరూ తమ ఆపిల్ దిగుబడి అధికంగా సాధించి, మన తెలుగు రాష్ట్రాల్లోకి ఆపిల్ దిగుమతి అవసరం లేకుండా చేస్తారు. మామిడి, జామ లాంటి ఫలాలను పండించి సరైన ధర రాక నష్టపోతున్న రైతులు ఈ ఆపిల్ పండ్ల ఉత్పత్తి ద్వారా అధిక ఆదాయాన్ని పొందాలని కోరుకుంటూ, అన్ని ప్రాంతాల రైతులు ఒకరినొకరు అనుసంధానం చేసుకుని మీ పంటల పరిరక్షణ మీరే ఒకరికొకరు తెలుసుకుని వీలైనంత ఖర్చులు తగ్గించుకుని, అధిక దిగుబడులు, లాభాలు ఆర్జించాలన్నదే 'పల్లెసృజన' లక్ష్యం. **- ఎడిటర్.**

**పి.వి.యస్. వర్మ గారు గత సంవత్సరం డిశంబర్‌లో నాటిన ఆపిల్ మొక్కలు ప్రస్తుతం ఇలా ఉన్నాయి.**



గణేశం గారికి,

ప్రపంచమంతా కోవిడ్ మహమ్మారి కోరల్లో చిక్కుకుని, ఎటువంటి ఆదాయం లేక ఇంటికే పరిమితమైన మాలాంటి ఇన్నోవేటర్లకు 'వెబినార్'ల ద్వారా మా ఇన్నోవేషన్‌లను, రైతుల మనోభావాలను తెలుసుకునే అవకాశం కల్పించటంతో పాటు, మా ఇన్నోవేషన్‌లను కూడా ఎటువంటి బాదరబందీ లేకుండా అమ్ముకోవటం ద్వారా మా కుటుంబాలను ఆదుకోవటం మాకెంతో సంతోషాన్నిచ్చింది. దాదాపు రెండు సంవత్సరాల కరోనా సమయంలో కూడా నేను నా వీడర్లను తయారు చేసి రైతులకు అందించి, నా కుటుంబ పోషణ భారం లేకుండా చేసిన 'పల్లెసృజన' వెబినార్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు.

**– వెంకటేశ్వరా చారి,** పర్కాల, హన్మకొండ జిల్లా.

ఎడిటర్ గారికి,

'పల్లెసృజన' వెబినార్లలో ఇన్నోవేటర్లమైన మేము పాల్గొనటం ద్వారా మా ఇన్నోవేషన్‌లను సమాజానికి ఎలా తెలియజేయాలి, ఎలా మాట్లాడాలో మాకు తెలియజేసింది. ప్రతి సంవత్సరం ఎన్నో ఎగ్జిబిషన్‌లలో పాల్గొని నేరుగా సమాజానికి మా ఇన్నోవేషన్లను పరిచయం చేసేవాళ్ళము. కానీ కోవిడ్ కారణంగా ఎక్కడికీ వెళ్ళలేని స్థితిని ఈ వెబినార్‌ల ద్వారా తీర్చి, మాలాంటి ఎంతోమంది ఇన్నోవేటర్లు ఇంటివద్దనే మా ఇన్నోవేషన్లను తయారు చేసి, అమ్ముకోగలగిగేలా చేసినందుకు ధన్యవాదములు. ఈ వెబినార్‌ల ద్వారా టెక్నాలజీని ఎలా వాడాలి, యాప్స్ ఎలా వాడుకోవాలి, వెబినార్‌లో పాల్గొన్న సభ్యులతో ఎలా మాట్లాడాలి లాంటి ఎన్నో నూతన విధానాలను కూడా మేము నేర్చుకున్నాము.

**– షన్ముఖరావు,** భూపాలపల్లి జిల్లా

**వెంకటేశ్వరాచారి, షన్ముఖరావు గారూ,**

వెబినార్ల ద్వారా మీకు ఎంతో మేలు జరిగినందుకు మాకెంతో సంతోషంగా ఉంది. ఈ వెబినార్ల ద్వారా అందరం కేవలం ఇళ్ళకే పరిమితం కాకుండా, సమాజానికి దగ్గరై, మన ఇన్నోవేషన్లను గురించి తెలుసుకునే చేయడం వల్ల అందరికీ ఎంతో మేలు జరిగింది. ముఖ్యంగా ఇన్నోవేటర్లకు అన్ని ప్రాంతాల వారి ఆలోచనలను తెలుసుకునే అవకాశం కలిగింది. మీరంతా వెబ్‌నార్‌లో పాల్గొన్నందుకు కృతజ్ఞతలు

**– ఎడిటర్.**

## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA)***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

పల్లెసృజన

# అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

## మంకీ గన్

ఇన్నోవేటర్ : **మహేష్ రెడ్డి**, నిజామాబాద్

అడవి పందులు, కోతులను పంట పొలాల నుంచి పారద్రోలటానికి బాణసంచా పేల్చే ఖర్చును రైతులు భరించలేరని ఆలోచించి, పివిసి పైపులతో  కేవలం నాలుగు ఐదు వందల ఖర్చుతో మొత్తానికి ఒక పరికరం తయారు చేశారు. ఈ పరికరంలో గ్యాస్ వెల్డింగ్ వారు ఉపయోగించే 'కాల్షియం కార్బోనేట్' అనే పదార్థా న్ని తెచ్చుకుని నిల్వ వుంచుకోవాలి. ఈ పరికరంలో కేవలం 10 నుండి 15 గ్రా. కాల్షియం కార్బోనేట్‌ను వేసి అందులో 5 మి.లీ. నీరు పోస్తే, 15 సెకండ్ల తర్వాత అందులో నుండి గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. ఆ గ్యాస్‌ను ఇంట్లో గ్యాస్ స్టౌ వెలిగించడానికి ఉపయోగించే లేదా సిగరెట్ వెలిగించుకునే గ్యాస్ లైటర్‌తో గాని వెలిగించినట్లయితే అది పేలి ఆ శబ్దం నాలుగు నుండి 6 ఎకరాల దూరం వరకు వినిపిస్తుంది. ఆ శబ్దానికి కోతులు, అడవి పందులు బెదిరి పారిపోతాయి.





## అలుపు లేకుండా ఎరువు వేసే పరికరం

ఇన్నోవేటర్ : **మహేష్ రెడ్డి**, నిజామాబాద్

మొక్కల మొదళ్ళవద్ద యూరియా వేయాలంటే వంగి మొక్కవద్ద వేయాలి. భూమిపైన వెయ్యటం వల్ల కొంత ఎరువు ఆవిరి రూపంలో పోయి, తక్కువ శాతం మొక్కకు అందుతుంది, కూలీల ఖర్చు కూడా ఎక్కువ. ఈ సమస్యలన్ని పరిష్కరిస్తుంది ఈ ఫర్టిలైజర్ గన్. దీని సహాయంతో సులభంగా మొక్క వద్ద వంగాల్సిన అవసరం లేకుండా నిలబడి, వేసిన మొత్తం ఎరువు మొక్కకు పూర్తిగా అందేలా భూమిలో వేయవచ్చు. మొక్క వద్ద భూమిలోకి పరికరాన్ని గుచ్చి ఒక మీటను నొక్కడం ద్వారా ఆ మొక్కకు ఎంత అవసరమో అంతే ఎరువు నేరుగా మొక్క ప్రక్కనే భూమిలోకి పడిపోతుంది. ఇలా చేస్తే ఎరువు గాలిలో కవకుండా 90 శాతం ఎరువు మొక్కకు అంది పంట దిగుబడి పెరిరుగుతుంది. ఒక మనిషి రోజుకు 4 ఎకరాల వరకు మిరప, మొక్క జొన్న, ప్రత్తి, ఇతర పంటలకు ఎరువులు వేయవచ్చు.

## ట్రాక్టర్ హైడ్రాలిక్ లెవెలర్

ఇన్నోవేటర్ : **ముళ్ళపూడి సత్యనారాయణ**, భద్రాద్రి కొత్తగూడెం



ట్రాక్టరు హైడ్రాలిక్ బద్దెలకు ఉన్న మెకానికల్ అడ్జస్టర్ స్థానంలో హైడ్రాలిక్ సిలిండర్ అమర్చాలి. హైడ్రాలిక్ లివర్ సాయంతో ఈ సిలిండర్ పైకి క్రిందకు పని చేస్తుంది. దీనివలన మెట్ట దుక్కిలో కల్టివేటర్‌ను, దమ్ము చేసే సమయంలో దమ్ము గొర్రును లెవెలింగ్ సమయంలో లెవెల్ బ్లేడును మరియు నాగలిని కూడా కుడివైపుకు, ఎడమ వైపుకు అవసరాన్ని బట్టి హైడ్రాలిక్ లివర్ ద్వారా పైకి, క్రిందకు సరిచేసుకోవచ్చు. ట్రాక్టర్ తయారీదారులు రూపొందించిన ప్రధాన హైడ్రాలిక్ లివర్‌కు ఎటువంటి మార్పు చెయ్యకుండానే ఈ లివర్‌ను ప్రత్యేకంగా అమర్చుకోవచ్చు. దీనివల్ల డ్రైవర్ ట్రాక్టర్‌ను నడుపుకుంటూనే అవసరాన్ని బట్టి పొలం దున్నే పరికరాలను లివర్ ద్వారా అవసరమనుకున్న వైపుకు క్రిందకు, పైకి నియంత్రించుకోవచ్చు. దీనివల్ల గట్ల ప్రక్కన లోతు దుక్కి, మాగాణి చేలల్లో గట్ల ప్రక్కన మెరకలను సులభంగా సరిచేసుకోవచ్చు. తక్కువ సమయంలో, తక్కువ డీజిల్ ఖర్చుతో ఈ పనులను చేసుకోవచ్చు. దీనివలన గట్లవద్ద కూడా లోతుగా దుక్కి దున్నటంతో పైరు సమానంగా పెరిగి, పంట దిగుబడి కూడా పెరుగుతుంది. రైతుకు పొలం దున్నటంలో అనవసరపు ఖర్చులు తగ్గిపోతాయి.


మొక్కలు కావలసిన వారు సంప్రదించండి :

బి. సుభాష్ చందర్, ఫోన్ : 9652801700; వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 79890 38186 / 81257 99904

PALLE SRUJANA Telugu Bi-monthly November - December 2021 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే

ఇన్నోవేషన్ల వీడియోల కొరకై ఈ QR కోడ్‌ను స్కాన్ చేసి చూడవచ్చు.



























పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.

లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

"Phone Pe"
no 9866 00 1678

QR code for Phone Pe

లేదా

'గూగుల్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.

## సభ్యత్వ వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- | 1,000/- |